


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 23-07-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 272 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## అంతరిక్షంలో అద్భుతఘట్టం


# చంద్రవిజయాన్

- సెప్టెంబర్ 7న దిగనున్న ఉపగ్రహం
- ఉపగ్రహం బరువు మొత్తం 3,447 కిలోలు
- జాబిల్లిపై విస్తృత పరిశోధనలు
- సంపూర్ణ నైపుణ్యం సాధించిన ఇస్రో
- శాస్త్రవేత్తలకు అభినందనలు - ఇస్రో చైర్మన్ శివన్

*శ్రీహరికోట: భారత అంతరిక్ష చరిత్రలో మరో అద్భుతమైన ఘట్టం ఆవిష్కృతమైంది. జాబిల్లిపై పరిశోధనల కోసం చంద్రయాన్ 2 ఉపగ్రహాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శ్రీహరికోట నుంచి విజయవంతంగా ప్రయోగించింది. 20 గంటల కౌంట్ డౌన్ అనంతరం 3.8 టన్నుల బరువైన చంద్రయాన్ 2 ఉపగ్రహంతో మధ్యాహ్నం 2.43 నిమిషాలకు నింగికెగసిన జీఎస్ఎల్వీ-మార్క్ 3ఎం1 వాహక నౌక(రాకెట్) 16 నిమిషాల 13 సెకెండ్ల పాటు ప్రయాణించింది. అనంతరం 170.06X40,400 కి.మీ. కక్ష్యలో చంద్రయాన్ 2ను విడిచిపెట్టింది. సగటును*

తరువాయి 2లో..





# రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నారు

- ఇలాంటి ప్రతిపక్షం ఎక్కడాలేదు
- శాశ్వత ఉద్యోగాల కల్పన ఓ రికార్డు
- సీఎం జగన్‌మోహన్ రెడ్డి



అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50శాతం రిజర్వేషన్లు ఇస్తుందని సీఎం జగన్ శాసనసభలో చెప్పారు. రిజర్వేషన్లను అడ్డుకుంటున్న ప్రతిపక్షం మరెక్కడా లేదని తెదేపాపై ధ్వజమెత్తారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకే కేటాయిస్తున్నామని తెలిపారు. శాశ్వత బీసీ కమిషన్ బిల్లును పెట్టి ఆమోదిస్తుంటే అడ్డుకుంటున్నారన్నారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్ల బిల్లును సైతం ప్రతిపక్షం అడ్డుకుంటోందని విమర్శించిన ముఖ్యమంత్రి.. రిజర్వేషన్లతో న్యాయం జరుగుతుంటే అగౌరవ పరిచే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

### శాశ్వత ఉద్యోగాల కల్పన ఓ రికార్డు

తెలుగు రాష్ట్రాల చరిత్రలో 1,33,494 శాశ్వత ఉద్యోగాల కల్పన ఓ రికార్డు అని ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్

తరువాయి 2లో..

## స్థానికులకే ఉద్యోగాలు చారిత్రాత్మక నిర్ణయం

- దళితుల పట్ల చంద్రబాబు నిర్లక్ష్య వైఖరి
- మున్సిపల్‌శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



అమరావతి: ఐదేళ్ల టీడీపీ పాలనలో దళితుల పట్ల చంద్రబాబు నాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మున్సిపల్‌శాఖ మంత్రి బొత్స సత్య నారాయణ విమర్శించారు. పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు కల్పిస్తూ చట్టం తీసుకు రావడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశ పెడుతుంటే బిల్లును అడ్డుకునేందుకు టీడీపీ గందరగోళం చేసిందని మండిపడ్డారు. సోమవారం

తరువాయి 2లో..

## ఫైబర్ గ్రిడ్.. ఒక మాయ

- బ్లాక్‌లిస్ట్‌లోని వేమూరికి కాంట్రాక్టా!?
- బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్



అమరావతి: ఏపీ ఫైబర్ గ్రిడ్ ఒక మాయ అని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ వ్యాఖ్యానించారు. శాసనమండలిలో సోమవారం ఏపీ ఫైబర్ గ్రిడ్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 149 రూపాయలకే కనెక్షన్ ఇస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు ఎక్కువ వసూలు చేసిందని ప్రశ్నించారు. ఫైబర్ గ్రిడ్‌పై అనేక ఆరోపణలున్నాయని, విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫైబర్ గ్రిడ్‌ను చేపట్టిన వేమూరి హరికృష్ణ ప్రసాద్‌పై ఈవీఎం ట్యాంపరింగ్

తరువాయి 2లో..

## ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ రోజు

### ఇస్రో చైర్మన్ శివన్ శుభాకాంక్షలు .. ప్రధాని మోదీ, రాష్ట్రపతి కోవింద్

శాస్త్ర సాంకేతిక రంగంలో భారత్‌ను ఉన్నతంగా ఉంచడమే తమ లక్ష్యమని ఇస్రో ఛైర్మన్ శివన్ అన్నారు. చంద్రయాన్-2 ప్రయోగం అనంతరం శివన్ మాట్లాడారు. ఇప్పటికి రాకెట్‌ను విజయవంతంగా నింగిలోకి పంపామన్నారు. అసలు ప్రయోగం ఇప్పుడు ప్రారంభమవుతుందని చెప్పారు. మార్క్-3 విజయం కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు. చంద్రయాన్-2లో ఇది ఆరంభం మాత్రమేనని చెప్పారు. వచ్చే 45 రోజులు తమకు అత్యంత కీలకమని.. సెప్టెంబర్ 7న రాత్రి ల్యాండర్ చంద్రుడిపై దిగిన తర్వాత యాత్ర పూర్తవుతుందన్నారు. తీవ్రమైన సాంకేతిక సమస్యలను అధిగమించగలిగామన్నారు.

తరువాయి 2లో..



# ఏపీ శాసనసభ ముందుకు ఆరు కీలక బిల్లులు


- సభలో వాగ్వాదాలు
- బుగ్గన ప్రకటనపై తెదేపా నిరసన
- టీడీపీ రాద్ధాంతంపై సీఎం ఆగ్రహం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో చరిత్రాత్మకమైన బిల్లులను ప్రవేశపెట్టింది. పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు కల్పిస్తూ.. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ. ఇక, నామినేషన్ పనుల్లోనూ, నామినేటెడ్ పోస్టుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ.. తీసుకువచ్చిన కీలక బిల్లులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సభ ముందు ఉంచింది. పరిశ్రమల్లోని 75శాతం ఉద్యోగాలు స్థానికులకే కల్పిస్తూ.. ప్రతిపాదించిన బిల్లును మంత్రి గుమ్మనూరు జయరామ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మహిళలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం కేటాయించాలని ప్రతిపాదించిన బిల్లును

తరువాయి 2లో..

## కుమార భవితవ్యం తేలేనా!?

**అనిశ్చితిలోనే కర్ణాటక రాజకీయం**
**వాడిగా వేడిగా అసెంబ్లీ సమావేశాలు**
**అసెంబ్లీలో అధికార, విపక్ష సభ్యుల మాటల యుద్ధం**
**కుమారస్వామి రాజీనామాపై ఊహాగానాలు?**



బెంగళూరు: మెగా సీరియల్‌ను తలపిస్తున్న కర్ణాటక రాజకీయ సంక్షోభం పూటకో మలుపు తిరుగుతూ ఉత్కంఠ రేపుతోంది. 14 నెలల కుమారస్వామి సంకీర్ణ సర్కార్ భవితవ్యం తేలే అవకాశం కనబడటంలేదు. విశ్వాస తీర్మానంపై చర్చను ముగించి సోమవారం బలపరీక్ష నిర్వహించాలనే నిర్ణయానికి స్పీకర్ వచ్చినప్పటికీ అసెంబ్లీలో విశ్వాస తీర్మానంపై జరుగుతున్న చర్చ అందుకు అవకాశమే లేనట్టుగా సాగుతోంది. సోమవారం

తరువాయి 2లో..




## ఎస్ఐ ఫలితాల వెల్లడి

**పోలీస్ శాఖలో ఖాళీల భర్తీకి ప్రత్యేక డ్రైవ్**
**హోంమంత్రి సుచరిత వెల్లడి**



అమరావతి: పోలీస్ శాఖలోని వివిధ ఖాళీల భర్తీకి నిర్వహించిన రాత పరీక్షల్లో 333 మంది ఎంపికయినట్లు రాష్ట్ర హోంమంత్రి మేకతోటి సుచరిత తెలిపారు. ఈ పోస్టుల భర్తీకై మొత్తం లక్షా 35 వేల 414 మంది ధరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. కాగా సబ్ ఇన్‌స్పెక్టర్ ఫలితాలను ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం విడుదల చేసిన విషయం తెలిసిందే. అనంతరం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి సీఎం, హోంమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో ఖాళీల భర్తీకి త్వరలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతామని అన్నారు. రాష్ట్రంలోని పోలీస్ శాఖలో ఇంకా 17శాతం వివిధ కేటగిరీల ఖాళీలను భర్తీ చేయాల్సి ఉందన్నారు.

ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ.. ప్రిలిమినరీ పరీక్ష, ఫిజికల్ ఫిట్ నెస్ పరీక్షల్లో 32 వేల 745 మంది అర్హత సాధించారు. తదుపరి నిర్వహించిన ఫైనల్ రాత పరీక్షలో 333 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వారిలో సబ్ ఇన్ స్పెక్టర్ సివిల్ కు 149 మంది, రిజర్వు సబ్ ఇన్ స్పెక్టర్

తరువాయి 2లో..



### ముంబయిలో భారీ అగ్ని ప్రమాదం

*ముంబయి: ముంబయిలోని బాంద్రా ప్రాంతంలో ఎంటీ ఎన్ఎల్ టెలిఫోన్ కార్యాలయ భవనంలో ఈ ప్రమాదం జరిగింది. సుమారు 100 మందికి పైగా కార్యాలయ సిబ్బంది భవనంలో చిక్కుకున్నారు*



### కేటాయించిన డోర్‌నెంబర్లను సందర్శించి

# చైతన్యవంతం చేయండి

- కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం : జివియంసి పరిధిలో మలేరియా సిబ్బంది వారికి కేటాయించిన ఇళ్ళను సందర్శించి సర్వయిలెన్స్ చేపట్టాలని కమిషనర్ డా.జి.సృజన పేర్కోన్నారు. నాలుగవజోన్ 40వ వార్డు మద్రిపాలెం జ్యోతినగర్, మహరాణి వీధులలో పర్యటించి పలు సూచనలు చేశారు. 300ల వరకు మలేరియా బృందాలు ఏంటి లార్వెల్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో మలేరియా వర్కర్‌కు కేటాయించిన ఇంటి నెంబర్లలో మాత్రమే సందర్శించి ఆ గృహస్తులను చైతన్యవంతం చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ఇంటింటి నుండి తడి-చెత్త పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని కోరారు. ప్రతి మలేరియా వర్కర్లు వీధిపేరు, వార్డు నెంబరు, డోర్‌నెంబరు ల ప్రకారం సర్వయిలెన్స్ నిర్వహించాలని, వారు సక్రమంగా నిర్వహిస్తున్నది లేనిది పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని గృహాలను నిర్దేశించిన సమయంలో సందర్శించి స్టెన్సిలింగ్ చేయాలని కోరారు. స్థానికులు నీటిసమస్య, బోర్‌వెల్ సమస్యల గురించి తెలుపగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.

కేటాయించిన విధులను సక్రమ పర్యవేక్షణతో సత్ఫలితాలు సాధించేలా పర్యవేక్షించాలని జోనల్ కమిషనర్ బి.వి.రమణ, ఏ.యం.ఓ.హెచ్ డా.రాజెష్ లను ఆదేశించారు. పర్యటనలో ఇఇ నరశింహారావు, అదనపు కమిషనర్ (ఎఫ్) సత్యనారాయణ, జోనల్ సిబ్బంది, మలేరియా సిబ్బంది పాల్గోన్నారు.

## ట్రిపుల్ ఐటీకి తెనుగుపూడి విద్యార్థులు ఎంపిక



దేవరాపల్లి :- మండలంలో తెనుగుపూడి సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కి ఎంపికైనట్లు ప్రిన్సుపాల్ విక్టర్ పాల్ తెలిపారు .పాఠశాల ప్రారంభం నుంచి నేటి వరకు ఎవరు ట్రిపుల్ ఐటీ కి ఎంపిక కాలేదన్నారు ,ఈ ఏడాది విద్యార్థుల్లో పెరిగిన విద్యాభివృద్ధి ,ఉపాద్యాయులు ప్రత్యేక శ్రద్ధ వలన నలుగురు విద్యార్థులు ఈ ప్రతిభ కనబరిచారన్నారు .ఈ సందర్భంగా ప్రిన్సుపాల్ విక్టర్ పాల్ సోమవారం మాట్లడుతూ ఎంపికైన విద్యార్థులు సాయి గణేష్ ,ఆర్ .గణేష్ ,బి .శివ ,ఏ . సాయి,ఉపాధ్యాయులను అభినందించారు .ఈ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోని మిగతా విద్యార్థులు బాగా చదివి ట్రిపుల్ ఐటీ సిటు సాధించే విధంగా తర్ఫీదు పొందాలని సుచించారు .

## దేవరాపల్లి హౌసింగు ఏఇ ప్రసాద్



దేవరాపల్లి :- మండల హౌసింగు ఏ ఇ గా పి.వి .ఎస్ .యన్ .ఆర్ .ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు .ఈయన అచ్చుతాపురంలో పని చేస్తూ ఇక్కడకు బదిలీ పై వచ్చారు .దేవరాపల్లి ఏ ఇ గా పని చేసిన సి హెచ్ .దేముడు విశాఖపట్నం బదిలీ అయ్యారు .దేవరాపల్లి వచ్చిన ప్రసాదును కొందరు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు .

## ఎంపి దృష్టికి రైల్వే స్టేషన్ సమస్యలు

యలమంచిలి రూరల్ : వాణిజ్య ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న యలమంచిలి రైల్వే స్టేషన్‌లో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలని అనకాపల్లి ఎంపి సత్యవతికి వైసిపి నేతలు వినతిపత్రం అందజేశారు. అలాగే యలమంచిలిలో రత్నాచల్, ప్రశాంతి, లింక్ ఎక్స్‌ప్రెస్‌లు నిలుపు చేసేలా కృషి చేయాలని కోరారు. ప్రయాణికుల సౌకర్యార్థం బోగీలు తెలిపే డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వైసిపి నేతలు గుప్తా, బద్దపు లక్ష్మి, శివ తదితరులు ఉన్నారు.

## ఎస్ ఐ ఫలితాల్లో మామిడిపల్లి వాసి విజయం

### - భర్త ప్రోత్సహమే నా విజయానికి కారణం - ఎస్ ఐ అభ్యర్థి నాళ్ళ పద్మావతి

దేవరాపల్లి :- మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన నాళ్ళ పద్మావతి ఎస్ ఐ గా ఎంపికైంది .సోమవారం విడుదలైన ఎస్ ఐ ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో ఎంపికయినట్లు కుటంబ సభ్యులు తెలిపారు .నిరుపేద రైతు కుటుబానికి చెందిన ఈమె గత ఐదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగానికి చేస్తున్న ప్రయత్నం నేటికు ఫలించిందని కుటంబం సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు .మామిడిపల్లి గ్రామానికి చెందిన ఈమె అదే గ్రామానికి చెందిన నాయుడు తో ఐదేళ్ల క్రితం వివాహమైంది ,ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో పిల్లలను కూడా వద్దనుకుని భర్త ప్రోత్సాహంతో రాజమండ్రి ,విశాఖలో పలు కోచింగు సెంటర్లలో చదివింది ,భర్త పూడి నాయుడు చోడవరంలో కంప్యూటర్ సెంటర్ పెట్టి జీవనం సాగిస్తూ ,భార్య ను చదివించాడు .ఈ సందర్భంగా పద్మావతి మాట్లడుతూ నా భర్త ప్రోత్సాహం కారణంగానే నాకు ఈ అవకాశం వచ్చిందని ఎస్ ఐ అభ్యర్థి పద్మావతి తెలిపారు .


## మండల వ్యవసాయాధికారి బదిలీ

రోలుగుంట : మండల వ్యవసాయాధికారిగా పని చేసిన పి.విజేతను అనకాపల్లి వ్యవసాయశాఖ ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు ఏడు సంవత్సరాల కాలం మండలంలో వ్యవసాయాధికారిగా పని చేసి సిబ్బందితో కలిసి రైతులకు శాఖాపరమైన సేవలు విస్తృత పరిచారు. సర్వీసు కాలం పరిగణలోనికి తీసుకొని ప్రభుత్వం నిర్వహించిన బదిలీల కౌన్సిలింగ్‌లో ఆమె బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం మండలంలో పని చేస్తున్న విజయలక్ష్మి ఇక్కడకు రానున్నారు.

## హాస్టల్‌ను పరిశీలించిన రిజిస్ట్రార్

ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఏయూ విద్యార్థినుల హాస్టల్‌ను రిజిస్ట్రార్ ఆచార్య టి.బైరాగి రెడ్డి సోమవారం ఉదయం పరిశీలించారు. ఏయూ ఇన్‌గేట్ వద్ద నున్న మహాళా హాస్టల్ భవనాన్ని సందర్శించి వసతి కల్పనపై చీఫ్ వార్డెన్‌తో మాట్లాడారు. విద్యార్థినులకు వసతి అదనపు వసతి కల్పనపై చర్చించారు. విద్యార్థినులకు ఇబ్బంది కలగకుండా పూర్తిస్థాయిలో వసతిని కల్పించాలనిసూచించారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## దర్జీ కుట్టుపని పెట్టుబడి నిధి ప్రభుత్వ సొసైటీ ద్వారా పంపిణీ చేయాలి



నాతవరంః దర్జీ కుట్టు పని పెట్టుబడి నిధి రూ.10వేలు ప్రభుత్వం సొసైటీలు ద్వారా పంపిణీ చేయాలని శ్రీబాల వరసిద్ధి కోటమ్మతల్లి టైలరింగ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నాతవరంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాతవరం మండలంలో 30 ఏళ్ల క్రితం నుండి దర్జీ(టైలరింగ్) వృత్తిపైన ఆధారపడి సొసైటీగా ఏర్పడి ఉన్నందున సదరు సొసైటీ సంఘం నందు నమోదు కాబడిన సభ్యులను గుర్తించి దర్జీ కుట్టు పని పెట్టుబడి నిధి మంజూరు చేయాలని కోరారు. వయస్సు నిర్ధారణ లేకుండా మంజూరు చేయాలన్నారు. విద్యార్హత లేకుండా వెసులబాటు కల్పించాలని, ఎటువంటి కమిటిల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. దర్జీ లబ్ధిదారుని అకౌంట్ ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నాతవరం తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కాలెపు బాబురావు, ప్రధాన కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, కోశాధికారి కె.బసవరాజు, ప్రతినిధులు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## పంపిణీకి సిద్దంగా జింక్ సల్ఫేట్

మాకవరపాలెంః చౌడు భూముల్లో వేసేందుకు జింక్ సల్ఫేట్ సిద్దంగా ఉందని వ్యవసాయాధికారి హేమ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మెట్ట, పల్లపు ప్రాంతాల్లో ఉన్న చౌడు భూముల్లో జింక్ సల్ఫేట్ వేసుకోవాలన్నారు. ఉచితంగా పంపిణీ చేసేందుకు టన్ను జింక్ సల్ఫేట్ వేసుకోవాలన్నారు. ఉచితంగా పంపిణీ చేసేందుకు టన్ను జింక్ సల్ఫేట్ సిద్దంగా ఉందన్నారు. దమ్ములు ప్రారంభం నాటికి జింక్‌ను పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## స్పందన కార్యక్రమంలో ఉపకరణముల పంపిణి

శ్రీకాకుళం: స్పందన కార్యక్రమంలో ఉపకరణాలను విభిన్న ప్రతిభావంతులకు జిల్లా కలెక్టర్ జె. నివాస్ పంపిణీ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి వచ్చిన వికలాంగులు శ్రీకాకుళంకు చెందిన డి. లీలా ప్రసాద్, వీల్ ఛైర్ ను ఇప్పించవలసిందిగా కోరారు. పొందూరు మండలం రాపాక గ్రామం నుండి ఎచ్చెర్ల మల్లేశ్వరరావు, శ్రీకాకుళం మండలం అరసవిల్లి గ్రామం నుండి రౌతు సూర్యనారాయణ, శ్రీకాకుళం మండలం కత్తెర వీధి నుండి శంబంగి అప్పలనాయుడు, శ్రీకాకుళం మండలం నుండి లెప్రసి కాలనీ నుండి గురయ్య తమకు ట్రై సైకిళ్లను మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేసుకున్నారు. వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీవన్ బాబు కు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే అధికారులు వికలాంగులకు అవసరమగు ట్రై సైకిళ్లను తెప్పించి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.నరేంద్రప్రసాద్, జిల్లా పరిషత్ ముఖ్య ప్రణాళిక అధికారి టి.కైలాష్ గిరీశ్వర్, జిల్లా సహకార అధికారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపడి వ్యక్తి మృతి

దేవరాపల్లి :- మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు పల్లపు కోడబు గ్రామంలో సోమవారం సాయంత్రం పిడుగుపడి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఉదయం నుంచి గ్రామ పొలిమేరలో పశువులు కాసుకొని సాయంత్రం ఇంటికి వస్తుండగా అకాల వర్షం కారణంగా పిడుగులు పడ్డాయి ,ఈ దాటికి అదే గ్రామానికి చెందిన టుకూరి దేముడు (45 )స్పృహ కోల్పోయి పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .అప్పటికే దేముడు మృతి చెందినట్లు వైద్యలు నిర్దారించారు .

మొదటి పేజీ తరువాయి

## ఏపీ శాసనసభ ముందుకు ఆరు కీలక బిల్లులు

మంత్రి మంత్రి శంకర్ నారాయణ సభ ముందు ఉంచారు. దీంతోపాటు నామినేషన్ పనుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ.. ప్రతిపాదించిన బిల్లులను ప్రవేశపెట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చరిత్రలో ఎన్నడూలేనివిధంగా అవకాశాలను కల్పించే దిశగా, మహిళలకు సమాన అవకాశాలు కల్పించేవిధంగా ఈ చరిత్రాత్మక బిల్లులను వైఎస్ జగన్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లులను ప్రవేశపెట్టే సమయంలో ప్రతిపక్ష టీడీపీ సభ్యులు రాద్ధాంతం చేయడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాలు, మహిళలకు మేలు చేకూర్చే బిల్లులను అడ్డుకోవాలని ప్రతిపక్షం చూస్తోందని, సభలో చరిత్రాత్మక బిల్లులను టీడీపీ అడ్డుకుంటోందని విమర్శించారు. 40 ఏళ్ల అనుభవం అంటే ఇదేనా? అని ఆయన ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడిని నిలదీశారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ద్రోహం చేసిన వారిని ప్రజలే శిక్షిస్తారని తేల్చి చెప్పారు. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు సమాన అవకాశం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50శాతం రిజర్వేషన్లు చరిత్రలో ఎప్పుడూ కల్పించలేదని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఇక, స్టేట్‌మెంట్ ఎక్కడైనా ప్రభుత్వం ప్రవేశపెడుతుందని, దానికి క్లారిఫికేషన్ మాత్రమే ప్రతిపక్ష అడుగుతుందని ఆయన పేర్కొన్నారు.

**చరిత్రాత్మకం.. విప్లవాత్మకం!**

ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడుతూ వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజకీయంగా, ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తూ ప్రభుత్వంలోని అన్ని నామినేటెడ్ పోస్టులు, నామినేషన్ పనుల్లో వారికి 50 శాతం కేటాయించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అంతేకాకుండా ఈ కేటాయింపుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు సగం దక్కేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు మిగిలిన 50 శాతంలో కూడా సగం మహిళలకే కేటాయించాలని నిర్ణయించడం ద్వారా ముఖ్యమంత్రి జగన్ వారికి పెద్దపీట వేశారు.

రాష్ట్రంలో నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు వీలుగా పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే కల్పిస్తూ కూడా ముఖ్యమంత్రి మరో విప్లవాత్మక నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నిర్ణయాలన్నింటికీ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించేందుకు వీలుగా రూపొందించిన బిల్లులను ప్రభుత్వం? సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ ముసాయిదా బిల్లులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన గత శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోద ముద్ర వేసిన సంగతి తెలిసిందే. ఈ చరిత్రాత్మక బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. 'దేశ, రాష్ట్ర చరిత్రలో ప్రథమం, సుదినం. మాట ప్రకారం ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవులు, పనులు, సర్వీసుల్లో 50% రిజర్వేషన్లు ఇస్తున్నాం. 50% అక్కచెల్లెమ్మలకు కేటాయించాం. శాశ్వత బీసీ కమిషన్ సహా, పరిశ్రమల్లో 75% ఉద్యోగాలు స్థానికులకు ఇచ్చేలా అసెంబ్లీలో బిల్లులు పెట్టాం' అని సీఎం వైఎస్ జగన్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## చంద్రవిజయాన్

3.84లక్షల కి.మీల దూరం ప్రయాణించనున్న ఈ ఉపగ్రహం సెప్టెంబర్ 7న జాబిల్లిపై దిగనుంది. చంద్రయాన్ 2 గురించి ఆసక్తికర విషయాలు!

చంద్రయాన్ 2 ఉపగ్రహం బరువు మొత్తం 3,447 కిలోలు. దీన్ని ఆర్బిటర్, ల్యాండర్, రోవర్‌తో అనుసంధానం చేశారు. వీటిలో ఆర్బిటర్ చంద్రుడి చుట్టూ తిరుగుతూ సమాచారాన్ని సేకరిస్తుంది. ల్యాండర్ చంద్రుడిపై దిగుతుంది. ల్యాండర్‌పై ఉండే రోవర్ జాబిల్లి ఉపరితలంపై నీటి ఆనవాళ్లను పరిశోధన చేస్తుంది. చంద్రయాన్ 2 ఉపగ్రహం జాబిల్లి కక్ష్యలోకి చేరుకున్న తర్వాత ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విడిపోయి చంద్రుడి దక్షిణ ధ్రువం దగ్గరగా నెమ్మదిగా దిగనుంది. అందులోంచి అత్యంత మృదువుగా రోవర్ బయటకు వచ్చి సెకెన్‌కు సెంటీమీటర్ వేగంతో 14 రోజుల పాటు పయనించనుంది. చంద్రుడి ఉపరితలంపై ఉన్న పదార్థాలను విశ్లేషించి ఆ సమాచారాన్ని, చిత్రాలను పంపించనుంది. చంద్రుడిపై నీరు, ఖనిజాలు, రాతి నిర్మాణాల గురించి పరిశోధనలు చేస్తుంది.

చంద్రయాన్2 ఉపగ్రహాన్ని చంద్రుడి దక్షిణ ధ్రువంలోకి ప్రవేశపెట్టడం అత్యంత సవాల్‌తో కూడిన పని. ఇస్రో సంపూర్ణ నైపుణ్యం సాధించాలని కోరుకుంటున్న అతి ముఖ్యమైన సాంకేతిక పరిజ్ఞానం ఇది. ఇస్రో చంద్రుడిపై క్లిష్టమైన సాఫ్ట్ ల్యాండర్ కోసం చేస్తున్న తొలి ప్రయత్నమూ ఇదే. ఆర్బిటర్ నుంచి ల్యాండర్, రోవర్‌ను వీడిన తర్వాత 15 నిమిషాలు అత్యంత కీలకమని ఇస్రో శాస్త్రవేత్తలు అంటున్నారు. చంద్రయాన్ 2లో అత్యంత సూక్ష్మంగా అత్యంత సమర్థంగా పనిచేసే ఎన్నో పరికరాలను అమర్చారు. చంద్రయాన్ 1 జాబిల్లిపై నీటిని గుర్తించగా.. చంద్రయాన్ 2 మరింత లోతుగా పరిశోధిస్తుంది. ఇందులో ఖనిజాలు, నీటి అణువుల్ని సవివరంగా గుర్తించే అమేజింగ్ ఐఆర్ స్పెక్ట్రోమీటర్, సింథటిక్ అపెర్చర్ రాడార్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి ఖనిజాలను మనం తవ్వి తెచ్చుకొనే వీలుందా అనేది తెలుస్తుంది. చందమామకు సంబంధించిన త్రీడీ మ్యాప్‌లను రూపొందించేందుకు జాబిల్లి పుట్టుక గురించి తెలుసుకొనేందుకు అవసరమైన సమాచారాన్ని చంద్రయాన్ 2 సేకరిస్తుంది. అంతిమంగా భవిష్యత్తులో మనం అక్కడికి వెళ్లి ఆవాసం ఏర్పాటు చేసుకొనే వీలుందా అన్న ప్రశ్నకు కొంతవరకైనా కచ్చితమైన జవాబు అందిస్తుంది.

**చంద్రుడిపై వ్యర్థాలు లేని అణుశక్తి, మూలకాల కోసం ఇది వెతకనుంది.**

చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపడుతోంది. ఈ ప్రాంతంలోనే నీటి ఆనవాళ్లు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. చంద్రయాన్ 2 ప్రయోగం విజయవంతమైతే అమెరికా, సోవియట్ యూనియన్, చైనా తర్వాత చంద్రునిపై సాఫ్ట్‌ల్యాండర్ చేసిన దేశంగా భారత్ ఘనత సాధించనుంది.

**ఇస్రో ప్రయోగం పట్ల విశాఖ ఎంపీ ఎంవీవీ హర్షం**



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన చంద్రయాన్ 2 పట్ల విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యన్నారాయణ హర్షం వ్యక్తంచేసారు. భారత దేశ - చరిత్రలో ఈ విషయాన్ని ఓ మైలు రాయిగా అభివర్ణించారు. ఎంతో శ్రమతో, భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన భారత శాస్త్రవేత్తలకు ఆయన తన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు. ఇదే తరహాలో భారత దేశ కీర్తిని ఖండాంతరాలు దాటించాలని ఆకాంక్షించారు.

## రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నారు

రెడ్డి అన్నారు.ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. మొత్తంగా 4.01 లక్షల ఉద్యోగాలను కల్పిస్తున్నామన్నారు. పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని వెల్లడించారు. గ్రామసచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొస్తున్నామని ప్రజల ఆశీర్వాద బలం వల్లే ఇదంతా సాధ్యమవుతోందని జగన్ చెప్పారు.

## స్థానికులకే ఉద్యోగాలు చారిత్రాత్మక నిర్ణయం

అసెంబ్లీ సమావేశాల అనంతరం.. మీడియా పాయింట్‌లో మంత్రి బొత్స మాట్లాడుతూ.. దళితులు, బలహీన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని సీఎం వైఎస్ జగన్ నిరూపించారని అన్నారు. మరోవైపు మంత్రి మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం చరిత్రలో సువర్ణ అధ్యాయనమని పేర్కొన్నారు. నామినేషన్ పదవుల్లో కూడా 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం గొప్ప విషయమని కొనియాడారు.

## ఫైబర్ గ్రిడ్.. ఒక మాయ

కేసు ఉందని, అతను బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నప్పుడు కాంట్రాక్ట్‌ను అతనికి ఎందుకు కట్టబెట్టారని ప్రశ్నించారు. ఈ పథకం కింద నాసిరకం సెటప్ బాక్స్‌లు సరఫరా చేశారన్న ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలన్నింటిపైనా ఎంక్వైరీ చేసి విచారణ జరపాలని కోరారు. దీనికి ఐటీ మంత్రి గౌతంరెడ్డి సమాధానమిస్తూ.. ఏపీ ఫైబర్ గ్రిడ్‌పై అనేక ఆరోపణలున్నాయని,బెంగుళూరులో రూ.1200కు ఇస్తున్న సెటప్ బాక్స్‌లను ఏపీలో రూ. నాలుగువేలకు ఇస్తున్నారని పేర్కొన్నారు. టెండర్ సమయంలో సెంటర్ విజిలెన్స్ గైడ్‌లైన్స్ కూడా పాటించలేదని తెలిపారు. ఏపీ ఫైబర్ గ్రిడ్‌పై జరిగిన అవకతవకలపై కేబినెట్ సబ్ కమిటీ విచారణ జరుపుతోందని, ఈవిచారణలో అన్ని నిజాలు బయటపడతాయన్నారు.

పోలవరం అంచనాలపై చర్చ

రూ. 16వేల కోట్ల నుంచి 55 వేల కోట్లకు పోలవరం ప్రాజెక్టు అంచనాలను ఎలా పెంచారని టీడీపీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ శాసనమండలిలో ప్రశ్నించారు. ఈ అంశంపై జరిగిన చర్చలో బీజేపీ ఎమ్మెల్సీ సోమూ వీర్రాజు మాట్లాడుతూ.. పోలవరంలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. పోలవరంలో ఈపీసీ నుంచి 60సీకి ఇచ్చే అవకాశం లేదన్నారు.చంద్రబాబు ప్రభుత్వం పోలవరం నిర్వాసితులపట్ల కనీసం ద ృష్టి పెట్టలేదని విమర్శించారు. డ్యాం కడితే సరిపోదని, నిర్వాసితులను ఆదుకోవాలని, అది తమ ప్రభుత్వం చేస్తోందన్నారు. పోలవరం కాపర్ డ్యాం పూర్తయితే.. 18వేల కుటుంబాలు ఇబ్బంది పడతాయని, కనీసం ఆ కుటుంబాలకు గత ప్రభుత్వం నష్ట పరిహారం కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. నవంబర్ 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం పోలవరం పనులు మొదలుపెడుతుందని వెల్లడించారు. పోలవరం కోసం తెచ్చిన ఏ మెటీరియల్ విషయంలోనూ ఆడిట్ చేయలేదని, పోలవరంలో జరిగిన అవకతవకలపై వారం రోజుల్లో సబ్ కమిటీ రిపోర్ట్ ఇస్తుందన్నారు. పోలవరాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారని, దానిని సీఎం వైఎస్ జగన్ పూర్తి చేస్తారని ఆయన స్పష్టం చేశారు. ఎన్ని జన్మలెత్తినా తెలుగుదేశం పార్టీ మాత్రం మరోసారి అధికారంలోకి రాదని అన్నారు.

## ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ రోజు

సమస్యను గుర్తించి వారంలోనే పరిష్కరించామని.. శాస్త్రవేత్తలందరూ 24 గంటలూ తదేక దీక్షతో పనిచేశారని శివన్ ప్రశంసించారు. ప్రతిక్షణం అత్యంత కఠినమైన పరీక్షలను ఎదుర్కొన్నామన్నారు. శాస్త్రవేత్తల అంకితభావం, కృషి తమకు ఈ విజయాన్ని అందించిందని చెప్పారు. లాంచ్ వెహికల్ టీమ్ అత్యంత సునిశిత పరిజ్ఞానంతో విజయం సాధించిందన్నారు. ప్రతి అంశాన్ని టీమ్ క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధరించిందని వివరించారు. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ నిష్ఠతో పని చేశారని శివన్ కొనియాడారు.

## ఎస్ఐ ఫలితాల వెల్లడి

ఆఫ్ పోలీస్(రిజర్వు) 75 మంది, రిజర్వు సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎపీ స్పెషల్ పోలీస్) 75 మంది డిప్యూటీ జైలర్లు(పురుష) 10 మంది, డిప్యూటీ జైలర్ (మహిళ) 4, స్టేషన్ ఫైర్ అధికారులు 20 మంది మొత్తం 333 మంది ఎంపికయ్యారు. రాత పరీక్షల్లో పరుచూరి మహేశ్ (నెల్లూరు), షేక్ హుస్సేన్ పీరా (కడప), పాలెం రవి కిశోర్ (కడప) టాపర్లుగా నిలిచి ముగ్గురూ 255 మార్కులు సాధించారు. మహిళలు 15 వేల 775 మంది పరీక్షలకు దరఖాస్తు చేయగా వారిలో 61 మంది ఎంపికయ్యరూ. కృష్ణా జిల్లాకు చెందిన విశ్వనాథపల్లి ప్రజ్ఞ 224 మార్కులతో మహిళల్లో టాపర్ గా నిలిచారు. ఎంపికైన అభ్యర్థులను వారి సర్టిఫికేట్లు పరిశీలన అనంతరం త్వరలో శిక్షణకు పంపండం జరుగుతుంది. పోలీస్ శాఖలో ఖాళీల భర్తీకి త్వరలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతాం. వాటి భర్తీకి త్వరలో ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ను చేపడతాం అని హోం మంత్రి సుచరిత వివరించారు.

## కుమార భవితవ్యం తేలేనా!?

మధ్యాహ్నం సభ ప్రారంభమైనప్పటి నుంచి మంత్రి కృష్ణ భైరెగౌడ ఒక్కరే దాదాపు మూడు గంటలకు పైగా ప్రసంగించినట్టు సమాచారం. ఇంకా ఈ అంశంపై మాట్లాడే 16 నుంచి 20 మంది సభ్యుల వరకూ ఉన్నట్టు స్పీకర్ రమేశ్ కుమార్ ఆ జాబితాను చదివి విన్పించారు. అంతా మాట్లాడాకే ఓటింగ్‌కు అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు. అందరూ కాకపోయినా ఆ జాబితాలో ముఖ్యులుగా ఉన్న సీఎం కుమారస్వామి, సీఎల్పీ నేత సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం పరమేశ్వర తదితర కొద్దిమందైనా తప్పనిసరిగా మాట్లాడే అవకాశం ఉంది. విశ్వాస తీర్మానంపై చర్చ పేరిట కాలయాపన చేసే వ్యూహాత్మక ఎత్తుగడతో అధికార పక్షం ముందుకెళ్తున్నట్టు కనబడుతోంది.

## గీతం నర్సింగ్ కోర్సులలో ప్రవేశాలు

సాగర్‌నగర్: గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ద్వారా నిర్వహిస్తున్న బిఎస్సీ నర్సింగ్ కోర్సులో 2019-20 సంవత్సరానికి గాను ప్రవేశాలకు ఈ ఏడాది దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కనకలక్ష్మి తెలిపారు. ఇంటర్మీడియట్ తత్సమాన పరీక్షలలో సైన్స్ సబ్జెక్టులతో 45 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఇంటర్మీడియట్‌లో ఒకేషనల్ నర్సింగ్ బ్రిడ్జ్ కోర్సు 45 శాతం ఉత్తీర్ణులైన వారు కూడా ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు.ఎమ్మెస్సీ నర్సింగ్ ప్రాక్టిషనర్ ఇన్‌క్రిటికల్‌కేర్ కోర్సులో ప్రవేశం పొందగోరేవారు బిఎస్సీ నర్సింగ్ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని ఏడాది వృత్తి అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఎమ్మెస్సీ నర్సింగ్‌లో ప్రవేశం పొందిన వారికి నెలకు 10 వేల రూపాయల ఉపకారవేతనం ఉంటుందన్నారు. విద్యార్థులు గీతం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.gitam.edu ద్వారా దరఖాస్తులును డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని సూచించారు.పూర్తి చేసిన దరఖాస్తులను గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ కార్యాలయానికి అందే విధంగా పంపాల్సి ఉంటుందని తెలిపారు.

మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్లు 0891-2727236, 2866555,9703430511, 7331136730 లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

## మధురానగర్ మునిసిపల్ స్కూల్ విద్యార్థులకు శ్రీ శ్రీ సాయిసరిగమప పుస్తక వితరణ



అక్కయ్యపాలెం: శ్రీ శ్రీ సాయిసరిగమప ఉచిత పుస్తక వితరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం జివిఎంసి ప్రైమరీ స్కూల్ మధురానగర్‌లో సుమారు 200 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు, పుస్తకాల అట్టలను అంగన్‌వాడీ విద్యార్థులకు రాత పలకలను అందించడం జరిగిందని శ్రీ శ్రీ సాయిగరిమప వ్యవస్థాపక అధ్యక్షురాలు హర్షవల్లి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ శ్రీ సాయిగరిమప సభ్యులు రమాదేవి, జ్యోతి, జివిఎంసి ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు దేముడు బాబు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు సహాయ సహకారాలందించారు.

## అనంత శ్రీకాంతా కృష్ణమాచార్యుల కీర్తనల పుస్తకావిష్కరణ



సింహాచలం : సింహగిరిపై సోమవారంనాడు సింహాద్రినాధుని ప్రియభక్తుడు సింహాద్రినాధునిపై ఎన్నో వేల సంకీర్తనలు రచించిన అనంత శ్రీకాంతా కృష్ణమాచార్యుల సంకీర్తనలను పుస్తకంగా ముద్రించి ఆవిష్కరించారు . ఈ కార్యక్రమం సింహాద్రినాధుని ఆలయ బేడామండపంలో కృష్ణమాచార్యుల విగ్రహంవద్ద దేవస్థానం ఈ ఓ కె .రామచంద్రమోహన్ గారి చేతులమీదుగా ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు టీపీ రాజగోపాలాచార్యులు ఏ ఈ ఓ పి రాంబాబు సూపర్డెంట్ రమణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చిన్నపిల్లల్లో అటిజంతో ఇబ్బందులు



విశాఖ సిటీ: స్థానిక డా బుల్లయ్య మహిళా సాంకేతిక కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్‌లో అల్గోరిథం, మెషిన్ లెర్నింగ్ అండ్ బ్రైన్ అనే అంశంపై జార్జియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జిఎ, యూఎస్ఏ,ఆచార్య సంతోష్.ఎస్.వెంపల, టెక్నాలజీ ఫర్ హెల్త్ సాండ్ వెల్ నెస్ అనే అంశంపై స్కూల్ ఆఫ్ ఇంటరాక్టివ్ కంప్యూటింగ్, జార్జియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూఎస్ఏ సీనియర్ రిసెర్చ్ సైంటిస్ట్, డా.రోసా అరిగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ముఖ్యంగా ఈమె చిన్నపిల్లల్లో ఆటిజం వలన కలిగే ఇబ్బందులు ఎఫెక్టివ్ హ్యూమన్ కంప్యూటర్ ఇంటర్ ఫేసింగ్ వలన నివారణకు దోహదం చేస్తుంది అని, అలాగే ఆచార్య సంతోష్ అత్యాధునిక కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంతో నవీన అడ్వాన్స్ మెంట్ మరియు అప్లికేషన్స్ ను ఆచరణలో పెట్టడానికి అవకాశం కలుగు తుంది అని చెప్పారు.

విద్యార్థినులు అడిగిన వివిధ సంశయాలకు సోదాహరణంగా సమాధానాలు చెప్పారు.డా. లంకపల్లి బుల్లయ్య సాంకేతిక కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దీపక్ చౌదరి అధ్యక్షత వహించిన ఈ సదస్సులో కళాశాల పాలకవర్గ కార్యదర్శి కరస్పాండెంట్ డాక్టర్ జి. మధు కుమార్ అతిధులను ఘనంగా సత్కరించారు.

కళాశాల డైరెక్టర్ (అకడమిక్ అడ్మినిస్ట్రేషన్) డా కె సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ ఎమ్ రెహమాన్, కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యక్షురాలు డా. మాధవి అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి చక్కగా చదువుకుని ఉజ్వల భవిష్యత్తు సాధించాలి

- 475 మంది విద్యార్థులకు వ్రాత పుస్తకాలు పంపిణీ
- వైకాపా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు



విశాఖపట్నం: సోమవారం ముస్లిం తాటిచెట్లపాలెంలో ఉర్దూ ప్రైమరీ స్కూల్‌లో 475 మంది విద్యార్థులకు ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

ఇక్కడ సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని సదుపాయాలు, సమస్యలను కావలసిన వనరులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె కె రాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకొని ఉజ్వల భవిష్యత్ సాధించాలని అసిస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో 32వ వార్డు వై కా పా నాయకులు బాణాల శ్రీనివాస్ అద్వర్యం లో నిర్వహించగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శాంతి కుమారి , 32వ వార్డు వై కా పా నాయకులు బాణాల శ్రీనివాస్, కె వీ బాబా, అబీబ్, షేక్ బాబ్జి, మధులత, నంబాల ఈశ్వరరావు, బాలమని, అలివేళ్ళు, కె.సుశీల, రమణ బాబు, పాల అప్పారావు, బాక్సర్ వెంకట రావు, తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టిగా పరిశోధనలు జరపాలి

### డిఎస్‌టి సలహాదారు డాక్టర్ అఖిలేష్ గుప్తా



ఆంధ్రా యూనివర్సిటీ: విశ్వవిద్యాలయాలలో విభిన్న విభాగాలు సమిష్టిగా పరిశోధనలు జరపడం ఎంతో అవసరమని డిఎస్‌టి సలహాదారు డాక్టర్ అఖిలేష్ గుప్త అన్నారు. సోమవారం ఉదయం ఇండియన్ మెట్రాజికల్ సొసైటీ, ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెట్రాలజీ, ఓషనోగ్రఫీ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ఆచార్య వి.పి సుబ్రహ్మణ్యం స్మారక ప్రసంగంలో ఆయన క్లైమేట్ రీసర్చ్ ఇన్ ఇండియా- స్టేటస్, చాలెంజెస్ అండ్ వే ఫార్వర్డ్ అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అందించే విశ్వవిద్యాలయాలు సంఖ్య రెండు రెట్లు పెరిగాయన్నారు. నేడు దేశవ్యాప్తంగా 2 వేల పరిశోధన సంస్థల్లో 2.5 లక్షల మంది పరిశోధకులు పనిచేస్తున్నారన్నారు. ఉన్నత విద్యలో 2.9 కోట్ల మంది యువత విద్యను అభ్యశించడం జరుగుతోందన్నారు.

భారత దేశం వంద సంవత్సరాలకు సంబంధించిన క్రమబద్ధమైన సమాచారాన్ని కలిగి ఉందన్నారు. విశ్వవిద్యాలయాలు పరస్పర సహకారం అందించుకుంటూ పరిశోధనలు జరపాలని, వీటిని డిఎస్‌టి సైతం సహకారం అందిస్తుందన్నారు. 55 శాతం పరిశోధన కేంద్రాలు ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా 12 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను డిఎస్‌టి ఏర్పాటు చేసిందన్నారు. ఈ దిశగా ఏయూసైతం కృషి చేయాలని సూచించారు. ప్రాంతీయ వాతావరణ మోడలింగ్‌ను అభివృద్ధి చేసే ప్రాజెక్టును ఏయూకు ఇవ్వడం జరిగిందన్నారు. గత 5 సంవత్సరాల కాలంలో 1200 శాస్త్రవేత్తలతో, 300 పరిశోధన కేంద్రాలను అనుసంధానిస్తూ, 180 కార్యక్రమాలను నిర్వహించామన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థలు రీసెర్చ్, డెవలప్‌మెంట్‌ను విస్మరించడం జరుగుతోందన్నారు. మెట్రాలజీ రంగంలో విద్యార్థులను ఆకర్షించాలని, వీరికి ఉపాధిని కల్పించే విధానాలను అమలు జరపాలన్నారు.

ఐఎండి డైరెక్టర్ జనరల్ డాక్టర్ కె.జె రమేష్ మాట్లాడుతూ అభివృద్ధి విధానాలలో వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. వర్షాలు కురిసే విధానంలో మార్పులు జరుగుతున్నాయన్నారు. వాటర్ బడ్జెట్, వాటర్ బ్యాలెన్స్‌లు జరపాలన్నారు. విభిన్న సంస్థలు సంయుక్త పరిశోధనలు జరపాలన్నారు. బోధన, పరిశోధనలో ఏయూ కీలక భూమిక పోషించాలన్నారు.

ఏయూ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు మాట్లాడుతూ మెట్రాలజీ రంగానికి ఏయూ విశేష కృషిజరపిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.బైరాగి రెడ్డి మాట్లాడుతూ మన అవసరాలకోసం పర్యావరణానికి హాని కలిగిస్తున్నామన్నారు. దీని ప్రభావం వర్షాలు, రుతువులపై పడుతోందన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ టి.వినోద రావు, విభాగాధిపతి ఆచార్య పి.సునీత, ఆచార్య ఎస్.ఎస్.వి.ఎస్ రామక్రిష్ణ తదితరులు ప్రసంగించారు

ఈ సందర్భంగా డాక్టర్ అఖిలేష్ గుప్తా, డాక్టర్ కె.జె రమేష్‌లను వర్సిటీ తరపున సత్కరించారు.

## వాతావరణ మార్పులపై పరిశోధకులు దృష్టి సారించాలి

### గీతంలో డిఎస్‌టి సలహాదారు అఖిలేష్ గుప్తా



సాగర్‌నగర్: వాతావరణ మార్పులపైన, వివిధ రంగాలపై దాని ప్రభావం పైనా విశ్వవిద్యాలయాలలోని పరిశోధకులు దృష్టి సారించాలని, ప్రభుత్వాలకు తగు సూచనలు ఇవ్వాలని భారతప్రభుత్వ శాస్త్రసాంకేతిక విభాగం సలహదారు డాక్టర్ అఖిలేష్ గుప్తా సూచించారు. భారత వాతావరణ విభాగం డైరక్టర్ జనరల్ డాక్టర్ కె.జె.రమేష్‌తో కలిసి సోమవారం ఆయన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో జరుగుతున్న పరిశోధనలను ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శరత్ చంద్ర బాబు వివరించారు. పర్యావరణం, సమాజం, భవిష్యత్తులో ఎదుర్కొనబోయే విపత్తులను దృష్టిలో ఉంచుకుంటూ పరిశోధనలు జరపాలన్నారు.ఈ సందర్భంగా పలు సూచనలు, సలహలు అందించారు. గీతం యుజిసి వ్యవహా రాల విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ సి.హెచ్.రామకృష్ణ మాట్లాడుతూ యుజిసి సహ బయోటెక్నాలజీ విభాగం, పర్యా వరణ మంత్రిత్వ శాఖ, ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చి వంటి సంస్థల సహకారంలో గీతంలో పరిశోధనలు జరుగుతు న్నాయని తెలిపారు. అంతర్జాతీయ జర్నల్స్‌లో గీతం పరిశోధనా పత్రాలు ప్రచురితం అవుతున్నా యన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అఖిలేష్ గుప్తా, డాక్టర్ కె.జె.రమేష్‌ను గీతం విశ్వవిద్యాలయం తరుపున ఘనంగా సన్మానించారు.

## స్పందన సమస్యల పరిష్కారంలో జిల్లాకు ద్వితీయ స్థానం

### *సంయుక్త కలెక్టర్ ఎల్.శివశంకర్*



విశాఖపట్నం : స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలు వేగం గణనీయంగా పెరిగిందని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎల్. శివశంకర్ తెలిపారు. సోమవారం ఉదయం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం తర్వాత అధికా రులతో ఆయన ఈ విషయమై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యల ఫలితంగా స్పందన కార్యక్రమంలో జిల్లా 13వ స్థానం నుండి రెండవ స్థానానికి వచ్చిందన్నారు. వివిధ శాఖల అధికారులు దరఖాస్తుదారులకు పంపించే సమాచారం సమగ్రంగా ఉండాలని అసంపూర్తిగా వుండరాదన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటి సరఫరా, మార్కెటింగ్, గృహ నిర్మాణ అధికారులు పిటిషన్లపై స్పందించిన జెసి వారి విధానాలను సరి చేసుకోవాలన్నారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో అధికారులు పరిష్కరిస్తున్న పద్ధతి కూడా తరచుగా పరిశీలించి సరి చేయాలన్నారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల కొరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి అభ్యర్థులు అర్హులు అయితే వాటిని జాబితాలో పొందుపరచాలని అదే విషయాన్ని దరఖాస్తుదారులకు తెలియజేయాలని ఆదేశించారు. యూనిట్లు మంజూరు కాగానే వారికి తెలియజేయడం జరుగుతుందన్నారు.

అంతకు ముందు డైల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో వచ్చిన ఫోన్ కాల్స్ కు ఆయన సమాధానాలు ఇచ్చారు. అనకాపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ముత్యం సంధ్య ఫోన్ చేస్తూ తమ గ్రామంలో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నదని అధికారులకు ఫిర్యాదు చేసినా ఎంతవరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. జాయింట్ కలెక్టర్ వెంటనే తగు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. గంట్యాడ మండలం విశాఖనగరం 50 వ వార్డు నుండి కే. గోవిందరాజులు ఫోన్ చేసి తమ వార్డులో అంగన్వాడి కేంద్రం ప్రైవేట్ బిల్డింగులో నడుస్తోందని సొంత భవనం కావాలని కోరారు. నర్సీపట్నం నుండి శివనారాయణరాజు మాట్లాడుతూ నర్సీపట్నం మున్సిపాలిటీలో రోడ్డును ఆక్రమణ చేసి షాపింగులు కట్టారని దాని పై చర్య తీసుకోవాలని కోరారు. కోర్టు కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మునగపాక మండలం సిరసపల్లి గ్రామం నుండి గోవిందు ఫోన్ చేసి పంచాయితీలో జరిగిన అవకతవకలపై సరి అయిన న్యాయం జరగలేదని అన్ని ఆధారాలు జిల్లా పంచాయతీ అధికారి వారికి ఇచ్చి ఉన్నామని దీనిపై వెంటనే విచారణ చేయించాల్సిందిగా కోరారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి 13 ఫిర్యాదులు వచ్చాయి.

## జివియంసి స్పందనకు 230 పిర్యాదులు

విశాఖపట్నం : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మొత్తం 230 ఫిర్యాదులు అందాయి. జివియంసి కమిషనర్ డా.జి.సృజన ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందిన మొత్తం 230 పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 153 ఫిర్యా దులు అందాయి. ఒకటవ జోన్‌కు సంబంధించి 18, మూడవ జోన్‌కు సంబంధించి 17, నాలుగవ జోన్‌కు సంబంధించి 4, ఐదవ జోన్‌కు సంబంధించి 6, ఆరవ జోన్‌కు సంబంధించి 10, అనకాపల్లి జోన్‌కు సంబంధించి ఒకటి, భీమిలి జోన్‌కు సంబంధించి 2, ప్రాజెక్టు డైరక్టర్ యుసిడి విభాగానికి సంబంధించి 19 ఫిర్యాదులందాయి.

### *డయల్ యువర్ కమిషనర్‌కు 30 ఫిర్యాదులు*

విశాఖపట్నం :- జి.వి.యం.సి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి 30 ఫిర్యాదులు అందాయి. జివియంసి కమిషనర్ డా.జి.సృజన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి హాజరై పలువురి నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో ఒకటవ జోన్‌కు సంబంధించి 8, రెండవ జోన్‌కు సంబంధించి 7 , మూడవ జోన్‌కు సంబంధించి రెండు, నాలుగవ జోన్‌కు సంబంధించి మూడు, ఐదవ జోన్‌కు సంబంధించి రెండు, ఆరవ జోన్‌కు సంబంధించి నాలుగు, అనకాపల్లి జోన్‌కు సంబంధించి మూడు, భీమిలి జోన్‌కు సంబంధించి ఒకటి ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడురోజులులోగా నివేదిక సమర్పించాలని కోరారు.

## ఇళ్లు పేరుతో మోసపోయిన అమాయక ప్రజలకు న్యాయం చెయ్యండి

- మంత్రి అవంతి కి సీపీఐ విజ్ఞప్తి - సానుకూలంగా స్పందించిన మంత్రి



విశాఖసిటీ : అమాయక పేద ప్రజలకు ప్రభుత్వ ఇళ్ళు ఇప్పిస్తానని నమ్మించి కోట్లాది రూపాయలు స్వాహ చేసిన బొత్స ప్రశాంత్ కుమార్ నుండి బాధితులకు తిరిగి డబ్బులు ఇప్పించాలని, జీవీఎంసీ కమీషనర్ సంతకం కార్యాలయం స్టాంప్స్, ఎస్.బి.ఐ అధికారుల సంతకాలు చలానాలు స్టాంపులు ఫోర్జరీ చేసి దాదాపు మూడు నుండి నాలుగు వందల మంది ని మోసం చెయ్య డానికి సహకరించిన అవినీతి అధికారులను చట్టప రంగా శిక్షించాలని సీపీఐ నగర కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు నాయకత్వాన కార్యవర్గ సభ్యులు డి.మార్కండేయులు, పి.ఈశ్వరరావు, ఎస్.కె.రెహమాన్ జి. వామనమూర్తి రాష్ట్ర పర్యాటక మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు గారిని కోరారు. సోమవారం సీతమ్మధార లోగల మంత్రి నివాసంలో మోసపోయిన బాధితులతో మంత్రి గారిని కలిసి పైడిరాజు మాట్లాడుతూ పైన్‌ఆపిల్ కాలనీ లో ప్రభుత్వం ఎన్.టి.ఆర్ గృహాలు ఇప్పిస్తామని, పరదేసిపాలెం లో భుదాన భూములు ఇప్పిస్తానని పేద ప్రజలవద్ద ఒక్కొక్కరి వద్ద రెండు లక్షల రూపాయలు చొప్పున దాదాపు నాలుగు నుండి ఐదు కోట్ల రూపాయలు స్వాహ చేసాడని మంత్రికి వివరించారు.

గత 3 సం క్రిందట జీవీఎంసీ లో ఇల్లు కుంభకోణం సీపీఐ వెలుగులోకి తెచ్చి అన్ని ఆధారాలతో అధికారులకు పిర్యాదుచేసిన ఏమాత్రం పట్టించుకోకుండా ఉండడం వలననే ఈరోజు బొత్స ప్రశాంత్ కుమార్ లాంటి వాళ్ళు ఇటువంటి కుంభకోణాలు తిరిగి చెయ్యడానికి కారణమైంది. మంత్రి గారు ప్రత్యేక దృష్టి పెట్టి ఇటువంటి అవినీతికి సహకరించిన అధికారులను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ మోసం చేసిన వారు ఎంతటివారైనా వదిలిపెట్టమని రాష్ట్ర మంత్రి శ్రీనివాసరావు బాధితులకు తెలిపారు.వెంటనే నగర పోలీస్ కమిషనర్ కి ఫోన్ చేసి ఇది 400 మందిని మోసం చేసిన పెద్ద స్కామ్ లా ఉందని సమగ్రంగా దర్యాప్తు చేసిన్యాయం చేయాలని ఆదేశించారు. మంత్రి కలిసిన వారిలో మోసపోయిన బాధితులు కీర్తి, శ్రీనివాస్, శైలజ, ధనలక్ష్మి, ఈశ్వరమ్మ, సురేష్, వీరరాజు,శివ, ఈశ్వరరావు,మహేష్, కృష్ణ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విజయభాను

సంపాదకీయం

## ఆసక్తిదాయకంగా చర్చలు

ఆఫ్ఘనిస్థాన్ శాంతిచర్చలు కీలకదశకు చేరుకున్న ఈ దశలో భారత్ ఎంతో చతురతతో వ్యవహరించవలసి ఉన్నది. ఇప్పటి వరకు భారత్ తాలిబన్లతో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నది. కానీ మరో వైపు అమెరికా సహా అన్ని తాలిబన్లతో పీకలలోతున చర్చల్లో మునిగిపోయాయి. ఈ దేశాలన్నీ ఏదో ఒక దశలో తాలిబన్లను ఉగ్రవాదులుగా విమర్శించినవే. కానీ మారిన పరిస్థితుల దృష్ట్యా చర్చల్లో చురుగ్గా పాల్గొంటున్నాయి. అమెరికాకు, తాలిబన్లకు, ఆఫ్ఘనిస్థాన్‌లోని భిన్నవర్గాలకు మధ్య చర్చలు సాగే విధంగా పురికొల్పుతున్నవి జర్మనీ, ఖతర్ దేశాలు. ఖతర్ ఈ చర్చలకు వేదికగా మారితే, తెరవెనుక రాయబారాలను జర్మనీ సాగిస్తున్నది. ఈ నేపథ్యంలోనే భారత్‌కు తాజా పరిస్థితిని వివరించి కలుపుకపోవడానికి జర్మనీ దౌత్యవేత్త మార్కస్ పోట్జెల్ ఢిల్లీ చేరుకున్నారు. తమ దేశం తరఫున ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ వ్యవహారాలన్నీ ఈయనే చూసుకుంటున్నారు. ఈ నెల 12వ తేదీన బీజింగ్‌లో జరిగిన సమావేశంలో అమెరికా, చైనా, రష్యాతోపాటు పాకిస్థాన్ కూడా పాల్గొన్నది. పాకిస్థాన్ చురుకైన పాత్ర వహించాలన్న అభిప్రాయాన్ని అమెరికా, చైనా, రష్యా వ్యక్తంచేశాయి. భారత్ అమెరికా బాటలోనే నడుస్తూ సొంత విధానాన్ని రూపొందించుకోలేకపోయింది. అమెరికా మద్దతుతో కొనసాగుతున్న ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూపోయింది. కానీ ఆఫ్ఘనిస్థాన్ అష్రాఫ్ ఘనీ ప్రభుత్వానికి ప్రజా పునాది లేదు. విదేశీ సేనల మద్దతు లేకపోతే నిలబడలేదు. ఈ దశలో కూడా భారత్ ఆఫ్ఘనిస్థాన్‌లోని అన్నిపక్షాలకు భాగస్వామ్యం ఉండాలని, రాజ్యాంగాన్ని గౌరవించాలని అంటూ కొన్ని ప్రాతిపదికలను సూచిస్తున్నది. ఈ ప్రాతిపదికలు పరోక్షంగా తాలిబన్లకు వ్యతిరేకంగా, ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వానికి అనుగుణంగా ఉన్నాయి. మార్కస్ పోట్జెల్ పర్యటన తర్వాత భారత్ వైఖరి ఎట్లా ఉంటుందనేది ఆసక్తిదాయకంగా మారింది. అమెరికాతోపాటు చైనా, రష్యా, ఇరాన్ తదితర దేశాలు తాలిబన్ల పట్ల తమ వైఖరిని హటాత్తు గా మార్చుకోవడానికి అనేక కారణాలు దోహద పడ్డాయి. ఇందులో ప్రధానమైనది తాలిబన్లను రూపుమాపడం సాధ్యం కాదనీ, ఆ సంస్థ అంగీకారం లేకుండా ఆ దేశంలో ఏ పనీ జరుగదనీ ఇతర దేశాలు భావిస్తున్నాయి. తాలిబన్లు ఉగ్రవాద సంస్థగా కాకుండా ప్రాతినిధ్య సంస్థగా కొం త పరివర్తన చెందడం మరో పరిణామం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ యుద్ధానికి ముగింపు పలుకాలని భావించడం ఇంకో కారణం. ఈ యుద్ధం కోసం ఏటా 45 బిలియన్ డాలర్లు ఖర్చుచేయడాన్ని ట్రంప్ జీర్ణించుకోలేకపోతు న్నారు. తాలిబన్లతో చర్చలు జరిపి, వారి నుంచి హామీలను పొంది, తమ సేనలను ఉపసంహరించుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. తాలిబన్ల మూలంగా తమ దేశాలలో ఇస్లామిక్ తీవ్రవాద సంస్థలు విస్తరిస్తున్నాయనే ఆందోళనతో చైనా, రష్యా, మధ్య ఆసియా దేశాలు చర్చలకు సము ఖత చూపాయి. అమెరికా కన్నా చాలాముందే ఈ దేశాలు తాలిబన్లతో చేతులు కలిపాయి. పశ్చి మాసియాలో భీకరమైన పాత్ర పోషించిన ఇస్లామిక్ స్టేట్ తీవ్రవాదులు ఆఫ్ఘనిస్థాన్‌లోకి ప్రవేశించడం మొదలుపెట్టారు. సిరియా, ఇరాక్ తదితర దేశాలలోని శత్రు పక్షాలను దెబ్బకొట్టడానికి ఐఎ స్ తీవ్రవాదాన్ని అమెరికానే సృష్టించిందనే అభిప్రాయం చైనా, రష్యా, ఇరాన్ తదితర దేశాలకు ఉన్నది. ఐఎస్‌ను కట్టడి చేయడానికి తాలిబన్లతో చెలిమి చేయడం మంచిదని ఇరాన్ ఇతర దేశాలు నిర్ణయించుకున్నాయి. మొదట తాలిబన్ వ్యతిరేక కూటమిలో ఉన్నప్పటికీ, ఇరాన్ ఆ సంస్థతో లోపాయి సంబంధాలను కలిగి ఉన్నది. భవిష్యత్తులో అమెరికాతో పోరాటానికి తాము సహకరి స్తామనే సంకేతాన్ని ఇరాన్ తాలిబన్లకు ముందే ఇచ్చింది. ఇరుగుపొరుగు దేశాలు తాలిబన్లకు మద్ద తు ఇస్తున్నందున, ఇక ఎంతకూ తెగని యుద్ధం చేయడం కన్నా చర్చలు జరుపడం మంచిదని అమెరికా స్థిర నిర్ణయానికి వచ్చింది. అమెరికా, తాలిబన్ల మధ్య దోహాలో ఏడు విడుతల చర్చలు జరిగాయి. అంతకు ముందు ఆఫ్ఘనిస్థాన్‌లోని భిన్నపక్షాల మధ్య చర్చలు రష్యాలో సాగాయి. అయితే ఆఫ్ఘనిస్థాన్‌లో ఉన్నది అమె రికా కీలుబొమ్మ ప్రభుత్వం కనుక, దానితో చర్చలు జరుపబోమని తాలిబన్లు ఎంతోకాలంగా అంటున్నారు. చివరికి మధ్యేమార్గం అనుసరించారు. ఇటీవల దోహాలో ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వ అధికా రులు తాలిబన్లతో చర్చలు జరిపారు. అయితే ప్రభుత్వ అధికారులుగా కాకుండా వ్యక్తిగత హోదా పేర చర్చలకు హాజరయ్యారు. తాలిబన్లతో పాటు ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వ అధి కారులు, పౌర సమాజ సభ్యులు, రాజకీయవేత్తలు, మహిళా కార్య కర్తలు- ఇట్లా అరువై మందికి ప్రతినిధులు పైగా ఉమ్మడి ప్రకటన జారీచేయడం అసాధారణం. యుద్ధాన్ని ఆపివేస్తేనే చర్చలు జరుపుతామనే షరతులు పెట్టకుండా, ఒకవైపు భీకర యుద్ధం సాగుతుండగానే ఇరుపక్షాలు శాంతి చర్చలకు దిగడం విశేషం.

## అనంతగిరి సంతలో
## నవరత్నాలపై నేచర్ కళా బృందం ప్రచారం



అనంతగిరి : ఉత్తరాంధ్ర కేంద్రంగా స్థానిక నేచర్ క్రియాశీల పౌర సమాజ సంస్థ, దిమ్సా ఫౌండషన్ నూతన ప్రభుత్వం ప్రవేశపెట్టిన సామాజిక భద్రత అభివృద్ధి కార్యా చరణ ప్రధాన కార్యక్రమం నవరత్నాలు, సంక్షేమ పథకాలపై నేచర్ కళాబృందం మారు మూల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిం చేందుకు శ్రీకారం చుట్టింది. సోమవారం అనంతగిరి వారపుసంతలో మరియు జూనియర్ కళాశాలలో నవరత్నాల పై అవ గాహన కల్పించారు. అలాగే మారుమూల గ్రామ ప్రజలకు నవరత్నాలలో పేర్కొన్న పథకాలు (1)వైయస్సార్ రైతు భరోసా(2) అందరికీ ఆరోగ్యశ్రీ (3) అమ్మ ఒడి ఫీజు రియంబర్స్మెంట్ (4) వైయస్సార్ ఆసరా పింఛన్లు పెంపు(5) మద్యపాన నిషేధం(6) వైయస్సార్ జలయజ్ఞం (7)పేద లకు పక్కా ఇల్లు(8) వైయస్సార్ చేయూత(9) యువతకు ఉపాధి గ్రామ సచివాలయంలో అందు బాటులోని వస్తున్న సేవలు ప్రభుత్వ పథకాలు స్థానిక భాషలో మారు మూల గ్రామాల్లో అవగాహన కల్పించారు అలాగే నేచర్ కళాబృందం కృష్ణబాబు సంతోష్ లు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఏజెన్సీ ప్రాంతం 11మండలాల్లో కూడా విస్తృతంగా కళాజాత ద్వారా అధివాసులకు అవగాహన కల్పించి ప్రతియొక్కరు ప్రభుత్వ ఫలాలు పొందేల ప్రచారం చేపట్టుతున్నామని వారు అన్నారు. ఈ కార్య క్రమంలో బి నరసింగరావు జి హెచ్ టిడి ఎస్ చంద్రరావు జి సి డబ్యు ఎస్ అనంతగిరి జూనియర్ కళాశాల ప్రిన్స్ పల్ ఆర్ కె నాయుడు వారి బృందం పట్నాయక్ బంగారురుబాబునేచర్ బృందం పాల్గొన్నారు.

## వాతావరణ సమతుల్యతే వర్షాలకు హేతువు : డాక్టర్ వెంకటేశ్వరరావు



విజయనగరం: ప్రతీఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తూ రోగాల బారిని పడకుండా జాగ్రత్తలను తీసుకోవాలని ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు డా॥ ఎం.వెంకటేశ్వరరావు విద్యార్థులకు బోధించారు.సోమవారం పట్టణంలోని కంటోన్‌మెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోజయంతి రామలక్ష్మణమూర్తి స్మారక గ్రంధాలయసంఘం ఆధ్వర్యంలో సంస్థ పట్టణ అధ్యక్షుడు మజ్జి కాంతారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడూతూ గాలి, నీరు, దోమలు వలన వ్యాధులు సంక్రమిస్తున్నాయని పరిశుద్ధ మైన గాలి, నీరు వినియోగిస్తూ దోమలను నిర్మూలన గావిస్తే ప్రతిఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సూచించారు. ప్రస్తుతం వాతావరణం సమతుల్యంలో లేనందున మానవులు, జంతువులు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, దానిని సరిదిద్దుకొనుటకు ప్రతీఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. పచ్చదనం వలన వర్షాలు వర్షిస్తాయని దానితో వాతావరణం సమతుల్యం అవుతుందని ,భవిష్యత్తులో నీటి యుద్ధాలు సంభవించే ప్రమాదం లేకపోలేదన్నారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకుంటూ ప్రతీ ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. జయంతి స్మారక గ్రంధాలయ సంఘం పట్టణ అధ్యక్షులు మజ్జి కాంతారావు మాట్లాడుతూ తమ సంఘం ఆద్వర్యంలో గ్రంధాలయాల అభివృద్ధి పరచుటతోపాటు ప్రతీ పాఠ శాలలో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు, నైతిక విలువలు వంటి అంశాలపై నిపుణులైన వారిచే బోధనాకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సంఘ ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌బాషా మాట్లాడుతూ జయంతి రామలక్ష్మణమూర్తి ఉపాధ్యా యునిగా పనిచేస్తూ విద్యార్థులకు భోధనతోపాటు గ్రంధా లయ ఉద్యమానికి ఎంతో కృషిచేసారని అన్నారు. కార్య క్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామా రావు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దాపురం రెవెన్యూ డివిజినల్ అధికారిగా
## యస్.మల్లిబాబు బాధ్యతల స్వీకరణ




పెద్దాపురం : పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివి జినల్ అధికారిగా యస్.మల్లి బాబు ప్రస్తుతం ఆర్డీవోగా పనిచేయుచున్న ఎస్ఎస్‌విబి వసంతరాయుడు నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లిబాబు మాట్లాడుతూ జిల్లాలో సెట్రాజ్ సీఇవోగా బాధ్యతలు నిర్వహించి, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దాపురం డివిజన్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. జిల్లాలో డిఆర్డీలు, పిడిగా పనిచేశానని, పెద్దాపురం తహశీల్దార్ కార్యాలయంలో కూడా ఉద్యోగిగా విధులు నిర్వహించానని, డివిజన్‌ల్లో పరిస్థితులపై అవగాహన ఉందని తెలిపారు. డివిజన్‌లోని శాసనసభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు ప్రజల సహకారంతో, ప్రభుత్వం ప్రవేశపెట్టిన, అమలు చేస్తున్న, నవరత్నాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవోని దళిత ప్రజా చైతన్య వేదిక అధ్యక్షులు నక్కా చిట్టిబాబు, సెక్రటరీ బి.ప్రకాశరావు, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, బియస్పీ నాయకులు, ఎజ్రా, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, తహశీల్దార్ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ కృష్ణారావు, రవితేజ, సిబ్బంది తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇసుక సరఫరాపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి : సిపిఐ డిమాండ్

అనకాపల్లి : రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇసుక రవాణాను నిలిపివేసి కార్మికులు పొట్టలు కొట్టడం అన్యాయం మని తక్షమే ఇసుకసరఫరా పై సర్కార్ వైఖరి ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణకార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు కోన. లక్ష్మణ డిమాండ్ చేశారు.

ఇసుక సరఫరా నిలిపివేతను నిరసిస్తూ సోమవారం ఉదయం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేల్పులవీధి కార్మికులు సెంటర్ నుండి కార్మికులు భారీ ర్యాలీ గా బయలుదేరి రామచంద్రదియటర్, 4రోడ్ల జంక్షన్ మీదగా ఆర్డీవో కార్యాలయంలో చేరి అక్కడ ఇసుక రవాణాను సులభతరం చేసి భవన కార్మికలకు పని కల్పించి ఆదుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు తో ధర్నా నిర్వహించి ఆర్డీవో కివినతిపత్రాన్ని సమర్పించారు. ధర్నాను ద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇసుక నిబంధలను సెప్టెంబర్ నెలలో ప్రకటించితామని చెప్పిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అంతవరకు ప్రత్యామ్నామం చూపక పోవడంతో ఇసుక పాలసీ మీద రాష్ట్ర ప్రభుత్వానికి సరైన అవగాహన లేదు అని అర్థం మవుతుంది అని ఆయన అన్నారు ఇసుక తవ్వకాలల్లో కుంభకోణం జరిగితే బాద్యలను గుర్తించి చర్యలు తీసుకోవాలని గాని ఏకంగా ఇసుక రవాణాను నిలిపివేయడం తగదు అని అన్నారు.

ఖాతాలో ప్రభుత్వం యితర అవసరాలకు వాడుకున్న నిధులను తక్షమే జమ చేయాలని, కార్మికులుకు పిఎఫ్ ఈఎస్ఐ తో పాటు 55 సంవత్సరాలు నిండినవారికి నెలకు5వేలు రూపాయలు పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని కోరారు బోర్డు ద్వారా ఇస్తున్నవివాహ కానుక 20వేలునుండి లక్ష రూపాయలు పెంచాలని, సహజంగా మరణానికి యిస్తున్న 80వేలు నుండి5లక్షలు కు, ప్రమాదశాత్తూమరణిస్తే 2లక్షలు నుండి10లక్షలు రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు.

## అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో
## పతకం సాధించిన ఎఆర్‌హెచ్‌సి




విజయనగరం: అఖిల భారత 62వ పోలీసు డ్యూట్ మీట్‌లో విజయనగరం జిల్లా పోలీసుశాఖలో క్లూస్ టీంలో పనిచేస్తున్నఫొటోగ్రాఫర్ సిహెచ్.వి. సత్యన్నారాయణ సిల్వర్ మెడల్ సాధించారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరిగిన మీట్‌లో ఆంధ్ర ప్రదేశ్ పోలీసుశాఖ తరుపున ఫొటోగ్రఫీ విభాగంలో సత్యన్నారాయణ ఈ పోటీల్లోపాల్గొన్నారు. నేర స్థలంను పరిశీలించి, నేర స్థలంను ఫొటోలు తీయడం, వాటిని సాక్ష్యాలుగా మలచడంలో సత్యన్నారాయణ చూపిన ప్రతిభకు వెండి పతకం లభించింది. వివిధ రాష్ట్రాలకు చెందిన వివిధ విభాగాల పోలీసులు పాల్గొన్న పోటీల్లో సత్యన్నారాయణకు పతకం లభించడం అభినందనీయం. ఫొటోగ్రఫీలో వివిధ అంశాల్లో జరిగిన ఈ పోటీల్లో సత్యన్నారాయణ అన్ని రంగాల్లో మిగిలిన పోలీసుల కంటే ఉన్నతమైన ప్రతిభను కనబర్చి రెండో స్థానంలో నిలిచారు. అంతేకాకుండా, ఆల్ రౌండర్ ఛాంపియన్‌షిప్ కు కూడా ఎంపికయ్యారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర డిజిపి చేతుల మీదుగా పతకాన్ని సత్యన్నారాయణ అందుకున్నారు. విజయనగరం జిల్లా పోలీసుశాఖలో ఎఆర్‌హెచ్‌సిగా 1995 నుండి పని చేస్తున్న సత్యన్నారాయణ, క్లూస్ టీం విభాగంలో పని చేస్తూ, పలు కేసులను చేదించడంలో విశేషమైన ప్రతిభ కనబర్చారు.ఈ పతకంతోపాటు సత్యన్నారాయణకు రూ॥ 2 లక్షల నగదు బహుమతి, ఆల్ రౌండర్ ఛాంపియన్‌షిప్ సాధించి నందుకుమరో రూ॥ 50వేల నగదు బహుమతులు లభించనున్నాయి. అంతేకాకుండా, రాష్ట్ర పోలీసు విభాగం పతకం సాధించి నందుకుగాను అదనంగా రెండు ఇంక్రిమెంట్లును ఇవ్వనున్నారు.

## హై కోర్టు ఆదేశాలు అమలు చేయాలి

జాయింట్ కలెక్టర్ శివశంకర్



విశాఖపట్నం : కృష్ణా కళాశాల భూముల విషయంలో హై కోర్టు ఆదేశాలు అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎల్. శివ శంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ఆయన చాంబర్ లో డా. వి.ఎస్. కళాశాల భూ ఆక్రమణపై ప్రిన్సిపాల్, తహసిల్దార్, తదితరులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి హై కోర్టు ఆదేశానుసారంగా అప్పటి కలెక్టర్ ఆదేశాలపై అప్పటి తహసిల్దార్ మరియు మండల సర్వేయర్లు సదరు పిటినర్ కు భూమి అప్పగించడమైనదన్నారు. హై కోర్టు ఆదేశాలను అమలు చేయాలని పట్టణ తహసిల్దార్ మరియు డా. వి.ఎస్. కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ లను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలోతహసిల్దార్ పి. ఉమా మహేశ్వరరావు, డా. వి.ఎస్. కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ డా. కె. రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## భవన కార్మికుల సమస్యలు
## త్వరితగతిన తీర్చాలి

### శాసనసభలో విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబు

విశాఖపట్నం : విశాఖపట్నంలోనే కాకుండా రాష్ట్రం మొత్తం భవన కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన ఇసుక సమస్యపై, సోమవారం శాసనసభలో విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబు మాట్లాడారు.

ఇప్పుడున్న ప్రభుత్వం రాష్ట్రం మొత్తం ఇసుకపై కొత్త పాలసీని తీసుకువచ్చే నిమిత్తం, ఇసుక సరఫరా పూర్తిగా ఆపి వేసిన నేపథ్యంలో భవన నిర్మాణంలో పనిచేస్తున్న భార్య, భర్త , కుటుంబ సభ్యులు పనులు లేక , చాలా ఇబ్బందులు పడుచున్నారని, రెక్కాడితేనే గాని డొక్కాడని బడుగు జీవులు గురుంచి ప్రత్యామ్నాయ మార్గాలు తొందరగా చూపించి, వారిని ఆదుకోవాలని కోరారు.

## విద్యుత్ ఒప్పందాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం
## విద్యుత్ సంస్థలు డుమ్మా?

అమరావతి : విద్యుత్ ఒప్పందాలపై ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనుంది. అయితే ఈ సమీక్షకు హాజరుకాకూడదని కేంద్ర విద్యుత్ సంస్థలు ఎన్టీపీసీ, ఎస్ఈసీఐ నిర్ణయం తీసుకున్నాయి. ఒప్పందాలు రద్దు చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నాయి. ఒప్పందాలను గౌరవించి, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిస్కం లకు ఎస్ఈసీఐ లేఖ రాసింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలను అవసరం అయితే రద్దు చేస్తామని సీఎం జగన్ చేసిన ప్రకటనపై కేంద్ర ఇంధన శాఖ స్పందించిన విషయం తెలిసిందే. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై పున:పరిశీలన చేయడం పారిశ్రామిక అభివృద్ధికి మంచిది కాదని హితవు పలికింది.పెట్టుబడిదారుల నమ్మకాన్ని జగన్ ప్రకటన దెబ్బతీస్తుందని హితబోధ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేసుకునే ఒప్పందాలు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరి కమిషన్ నిబంధనల ప్రకారమే జరుగుతాయని పేర్కొంది. అదికూడా బహిరంగ వేళం ప్రక్రియలో సాగుతాయని గుర్తుచేసింది. 2022 నాటికి 175 గిగా వాట్ల పునరుత్పాధక శక్తి సాధించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర ఇందన శాఖ గుర్తు చేసింది.

## పెద్దాపురంలో చోరీ

పెద్దాపురం : సామర్లకోట రహదారిలో గల మారుతీనగర్‌లో తాళాలు వేసిన ఒక నివాస గృహంలో చోరీ జరిగినట్లు పెద్దాపురం ఎస్సై వెలుగుల సురేష్ తెలిపారు. రెండురోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం బంధువుల ఇంటికి వి.వీరభద్రరావు వెళ్ళారు. ఆ సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడి, సుమారు 31/2 కాసుల బంగారం, రూ.25వేల నగదు దోచుకున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కొనసాగుతున్న గ్రామ వాలంటీర్ల ఎంపిక

పెద్దాపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ వాలంటీర్ల ఎంపిక ప్రక్రియ కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన ఇంటర్వ్యూలలో కట్టమూరు, జి.రాంగంపేట గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈ అప్పారావు, కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాకాలనీ సమస్యలను పరిష్కరించాలని వినతి



గాజువాక: జీవీయంసీ 63వ వార్డు ఇందిరాకాలనీలోని పలు సమస్యలను పరిష్కరించాలని జోన్-5 జెడ్సీ శ్రీధర్‌కు స్థానికులు వినతి పత్రాన్ని అందజేసారు. సోమవారం నిర్వహించిన జోన్-5గాజువాక కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్సీసెల్ నాయకులు పాము రామశాస్త్రి, మైనార్టీ సెల్ నాయకులు సౌకత్ అలీ, మహిళా నాయకురాలు ఆశా ఆధ్వర్యంలో కాలనీవాసులు జెడ్సీని కలిసి సమస్యలను వివరించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ వార్డులోని ఇందిరాకాలనీ లో ఉన్న ప్రధాన గెడ్డలో పేరుకుపోయిన చెత్తవలన ఇబ్బందులు ఎదురౌతున్నాయని, అలాగే మలమూత్ర విసర్జనలను నేరుగా గెడ్డలోనికి వదిలేయడంతో విపరీతమైన దుర్వాసన వ్యాపిస్తుందని, దోమలు ఎక్కువైపోవడంతో తరచూ జ్వరాల బారిన పడి ఆనారోగ్యంపాలవుతున్నామని తెలిపారు.

తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతూ జెడ్సీకి వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. జెడ్సీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నజ్రీన్, కౌసర్, సుజాత, మంగా, పి.లక్ష్మి, జ్యోతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మెగా అభిమాని కుటుంబానికి గీతా అర్ట్స్ చేయూత



సింథియా: ఇటీవల ఆనారోగ్యం కారణంగా మృతి చెందిన మెగాస్టార్ చిరంజీవి అభిమాని నాయుడు కుటుంబానికి గీతా అర్ట్స్ అధినేత అల్లుఅరవింద్, ప్రముఖ హీరో అల్లుఅర్జున్‌లు చేయూతనిచ్చారు. మల్కాపురం ప్రాంతానికి చెందిన నాయుడు చిరంజీవి అభిమాని. టీ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ జీవించేవాడు. ఇటీవల ఆనారోగ్యం కారణంగా మృతిచెందడంతో అభిమానులు దిగ్భ్రాంతికి గురైయ్యారు. దీంతో మెగాఅభిమానులందరూ కలిపి ఆ కుటుంబానికి లక్షరుపాయల చెక్కును ఇచ్చి ఆదుకున్నారు. అయితే ఈ విషయాన్ని నగరానికి విచ్చేసిన ప్రముఖ నిర్మాత, గీతా అర్ట్స్ అధినేత అల్లు అరవింద్‌కు రాష్ట్ర చిరంజీవి యువత ప్రధానకార్యదర్శి కోయిలాడ శ్రీనివాసరావు చేరవేయడంతో స్పందించిన అల్లుఅరవింద్ మృతిని కుటుంబానికి ఆదుకోవడానికి ముందుకొచ్చారు. దీని బాధ్యతను అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షులు రవణం స్వామినాయుడుకి అప్పగించారు. దీనిలో భాగంగా సోమవారం రూ.50వేల చెక్కును మృతిని కుటుంబానికి అందజేసారు. అంతేకాకుండా ప్రతీ ఏడాది పిల్లల చదువు నిమిత్తం రూ.50వేలను అందజేయడం జరుగుతుందని ఉత్తరాంధ్ర చిరంజీవి యువత అధ్యక్షులు పాలరౌతు వెంకటరమణ అన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక చిరంజీవి యువత అధ్యక్ష, కార్యదర్శులు దేముడు, బొంతు కనకరాజు, ఉరుకూటిరాము, సింథియా రవి, కార్యనిర్వాహక కార్యదర్శులు నర్సింగరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## అశ్లీల నృత్యాల నిర్వాహకురాలు అరెస్ట్

### 15 రోజుల రిమాండ్

చోడవరం : మండలంలోని జన్నవరం గ్రామంలో పండుగ సందర్భంగా రికార్డింగ్ డాన్సుకు ఇద్దరు అమ్మాయిలను సంప్లైచేసిన వడ్డాది గ్రామానికి చెందిన దాలియా మాధవిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్.ఐ, ఎస్.ఎ.మునాఫ్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 27న గ్రామందేవత పండుగలో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు డాన్సర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.అప్పటి నుండి డాన్సర్లను సప్లైచేసిన నిర్వాహకురాలు తప్పించుకుని తిరుగుతుండగా, సోమవారం పట్టుకుని కోర్టుకు తరలించగా, 15 రోజులు రిమాండ్ విధించగా విశాఖ సెంట్రల్ జైలుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

## స్పందనకు 72 దరఖాస్తులు



దేవరాపల్లి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 72 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ సి హెచ్ .సుబ్బాలక్ష్మి తెలిపారు. వివిధ రకాల పింఛన్ల కోసం ఈ దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పర్యవేక్షణాధికారి జి.వి.రమణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిర్ణీత తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరు కావాలి

### - కమిషనర్ ఎస్.ఎస్.వర్మ

విజయనగరం : వార్డు వాలంటీర్ల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులు నిర్ణీత తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కమిషనర్ ఎస్.ఎస్.వర్మ అభ్యర్థులకు సూచించారు. సాంకేతిక కారణాలతో సమాచారం అందని అభ్యర్థులకు ఈనెల 24, 25 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. సోమవారం నాలుగు ఫానల్స్‌గా అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలను కమిషనర్ ఎస్.ఎస్.వర్మ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల ఎంపికలో సామాజిక స్పృహ, సేవా, అంకితభావాలే ప్రాధాన్యత అంశాలుగా అధికారులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే పారితోషికం కేవలం గౌరవ వేతనంగా ఉంటుందని, దీనికి కట్టుబడి సేవా తత్పరత, అంకితభావాలు, నిజాయితీ కలిగిన యువతను ఎంపిక చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారన్నారు. అదేవిధంగా నవరత్నాలు వివరాలు, వాటిపై అవగాహనపై పలు ప్రశ్నలు సంధిస్తూ, అభ్యర్థుల అంకితభావాన్ని అంచనా వేస్తున్నామన్నారు. అదే విధంగా రాబోయే రోజుల్లో వారు అందించే సేవలు నిబద్ధతగా ముందుకు సాగాలన్న సందేశాన్ని అభ్యర్థులకు అధికారులు అందిస్తూ, జిల్లా, ప్రజా సమస్యలపై అవగాహన, వారి పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ఎటువంటి చర్యలు తీసుకుంటారంటూ ప్రశ్నలు వేస్తున్నామన్నారు. అలాగే వార్డుల్లో పరిశుభ్రతకు తీసుకునే చర్యలుపైన వాలంటీర్ అభ్యర్థుల మనోభావాలను తెలుసు కుంటున్నామన్నారు.

## స్పందన కార్యక్రమానికి విశేష స్పందన

విజయనగరం : ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించేందుకు వీలుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. స్పందన కార్యక్రమంలో అధికారులకు విజ్ఞప్తులు అందజేసేందుకు కార్పొరేషన్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో కార్యాలయం కిక్కిరిసిపోయింది. కమిషనర్ ఎస్.ఎస్.వర్మ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పింఛన్‌కు సంబంధించి అర్జీలు అధికంగా వచ్చాయి. అర్జీలను ఆన్‌లైన్ చేసి రశీదులను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎస్.ఎస్.వర్మ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు జవాబుదారీ, పారదర్శకమైన పాలన అందించాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని నెరవేర్చే దిశలో కార్పొరేషన్ అధికారులందరూ ఆయా శాఖల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి అందించే విధంగా కృషి చేస్తున్నారన్నారు.

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM**
**EP 49/2018 OS 463/2016**

**Between :**
**K.Rajeswara Rao ...Dhr/Plaintiff**
**And:**
**B.Jagadeeswara Rao ...Jdr/Defendant**

**NOTICE**

**To,**
**B.Jagadeeswara Rao, Plot : 302,**
**Talapula Oceanic Apartments, Opp.Appughar,**
**Visakhapatnam-530017.**

Please take notice that the above named Dhr/Plaintiff has instituted the above case against you and the same stands posted to **28/08/2019** for your appearance, on that day at **10-30 A.M.** You should appear before the aforesaid Honourable Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, ex-parte.

**K.Madhusudhana Rao**
**Advocate**
**Visakhapatnam.**
**Cell No: 9989012912**
**9010182703.**

### ప్రభుత్వ పాఠశాలల్లో

# మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

చోడవరం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని సోమవారం పున:ప్రారంభించారు. చోడవరం బాలికోన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.కృష్ణకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సోదరుడు జయదేవ్, ఎం.ఈవో పి.అచ్చుతరావు పాల్గొని ప్రారంభించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలకు నవప్రయాష్ ద్వారా మధ్యాహ్న భోజన పథకం నిర్వహించేవారు. ఈ నెల 18 నుంచి నవప్రయాష్ భోజన పథకం పూర్తిగా ఆగిపోవడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేలా మధ్యాహ్న భోజన పథకాన్ని పాత ఏజెన్సీలకే తిరిగి అప్పగించి, సోమవారం నుంచి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో వై.సి.పి నాయకులు ఓరుగంటి నెహు, ముప్పిరెడ్డి సూర్యనారాయ, బొడ్డు ప్రసాద్,శరగడం మధు, పాఠశాల ఉపాధ్యాయులు, భోజన పథకం నిర్వాహకురాలు గూనూరు వరలక్ష్మి, బుచ్చిరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినీలకు భోజనం వడ్డిస్తున్న వైసీపీ నాయకులు



విద్యార్థుల కృత్యాలను పరిశీలిస్తున్న జిల్లా సహిత విద్య సమన్వయాధికారి ఎం.ప్రసాద్.

## భవిత కేంద్రంను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా సహిత విద్య సమన్వయాధికారి

చోడవరం : పట్టణంలోని భవిత కేంద్రంను జిల్లా సహిత విద్య ఇన్‌చార్జిసమన్వయకర్త ఎం.ప్రసాద్ సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా దివ్యాంగులకు అమలు చేస్తున్న కృత్యాలు, సేవలు, వివిధ ఉత్పత్తుల తయారీ, ఫిజియో థెరఫీ సేవలు తదితరవాటిని స్వయంగా పరిశీలించి, అనంతరం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ర్యాంపు, రన్నింగ్ వాటర్ కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో రీసోర్సు ఉపాధ్యాయులు భీశెట్టి అప్పలరాజు, సరస్వతిదేవి, ఫిజియోథెరఫిస్ట్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# తప్పిన పెను ప్రమాదం



సబ్బవరం : సబ్బవరం - అనకాపల్లి రోడ్డులోని అసకపల్లి జంక్షన్ వద్ద పెను ప్రమాదం తప్పింది. ఆగి ఉన్న కారుపై జెసిబి వెళ్లడంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఆ సమయంలో కారులో నలుగురు ఉన్నా ఈ ప్రమాదంలో ఎవరకీ ఎటువంటి గాయాలు కాలేదు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చీడికాడ మండలం, ఖండివరం గ్రామానికి చెందిన సుంకర శ్రీనువాసరావు తన కుటుంబ సభ్యులతో ఆదివారం లంకెలపాలెం లోని బంధువుల ఇంటికి ఫంక్షన్‌కు వెళ్లి అక్కడ నుండి కేబ్ ద్వారా వస్తున్నారు. అసకపల్లి జంక్షన్ వద్ద వచ్చేసరికి ఎదురుగా వాహనాలు వస్తుండడంతో కేబ్ డ్రైవర్ పి.వెంకటరమణ కారును ఆపి వాహనాలు వెళ్లిపోయిన తరువాత వెళదామని చూస్తుండగా సబ్బవరం నుండి వస్తున్న జెసిబి జంక్షన్ అనకాపల్లి వెళ్లడానికి టర్న్ తీసుకుంటూ అదుపు తప్పి ఆగి ఉన్న కారుపై దూసుకు వెళ్లాడు. దీనితో కారు ఇంజన్ భాగం నుజ్జునుజ్జు అయ్యింది. అయితే ఆ సమయంలో కారులో డ్రైవర్ వెంకటరమణ (48), సుంకర శ్రీనువాసరావు (47), అతని భార్య జ్యోతి (45), కుమారుడు పవన్‌కుమార్ (21) ఉన్నారు.అయితే వీరెవ్వరికీ ఎటువంటి గాయాలు అవ్వలేదు. ప్రమాదం జరిగిన పరిస్థితి తీవ్రంగా ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే జెసిబి డ్రైవర్ పరారయ్యాడు. సబ్బవరం ఎస్సై ప్రభాకరరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సింహగిరిపై ముగిసిన వరుణయాగం

సింహాచలం : సింహాద్రి నాథుని ఉపాలయం సింహగిరిపై వెంచేసియున్న శ్రీ త్రిపురాంతకస్వామి ఆలయంలో రాష్ట్రంలో తీవ్ర వర్షాబావ ప్రభావంతో అనావృష్టి నివారణార్థమై వర్షాలు సమృద్ధిగా కురవాలని భారతదేశం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ దేవదాయ శాఖ అధికారుల అదేశాలమేరకు గత మూడు రోజుల పాటు సింహగిరి త్రిపురాంతకాలయంలో వరుణ యాగం విశేషంగా జరిపారు గణపతిపూజ పుణ్యాహవచనం పరిషత్ ఋత్విక్ గ్వరణం దీక్షాధారణ మండపారాధన కళ స వాహనం వరుణమంత్ర జపములుతో ప్రారంభమైన యాగం చివరిరోజున ఏకాదశి అభిషేఖం కుంకుమాభిషేఖం మహా ఘట్టాభిషేఖం నీరాజన మంత్రపుష్పములు చతుర్వేదస్వస్తి మహ దాశీర్వాదం మహా పూర్ణాహుతితో యాగం ముగిసింది.



## స్పందన కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు : సిఐ తాతారావు



అనకాపల్లి : పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి ఐదు ఫిర్యాదులు వచ్చాయని, పట్టణ సిఐ తాతారావు తెలిపారు. ఈసందర్భంగా సిఐ తాతారావు మాట్లాడుతూ పట్టణంలో సాయికుల్వంత్ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇమ్మంటే 11 వేలుఅదనుపు ఫీజు కట్టమని ఇబ్బంది పెడుతున్నారని, ఫిర్యాదు వచ్చిందని, అని అన్నారు. అలాగే పొలం బోర్లు వైర్లు కత్తిరించి దొంగలించారని, ఫిర్యాదు 2015 సంవత్సరంలో లంకెలపాలెంలో గల ఒక దాబాకు 14 లక్షల రూపాయలు కిరణా సామాగ్రిని అప్పుగా ఇవ్వడం జరిగిందని 2016 లో పెద్దల సమక్షంలో 10 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిర్చారని, అయినప్పటికీ ఇప్పటి వరకు ఇవ్వలేదని ఫిర్యాదు చేసినట్లుగా సిఐ తెలిపారు.

## హెూంగార్డులకు బ్యాంకుల ద్వారా వ్యక్తిగత రుణ సౌకర్యాలు

### జిల్లా అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు

విజయనగరం : జిల్లా పోలీసుశాఖలో హెూంగార్డులుగా పని చేస్తున్న వారికి బ్యాంకులు వ్యక్తిగత రుణాలను మంజూరు చేస్తున్నట్లుగా అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు తెలిపారు.జిల్లా ఎస్పీగా బి. రాజకుమారి బాధ్యతలు చేపట్టిన తరువాత హెూంగార్డు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడగల బంగారాజు ఆధ్వర్యంలో కొంతమంది హెూంగార్డులు జిల్లా ఎస్పీని కలిసి, తాము జాతీయ బ్యాంకు ఖాతాల నుండి జీత, భత్యాలను తీసుకుంటున్నట్లు, తమ ఆర్థిక అవసరాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేసే విధంగా చొరవ చూపాల్సిందిగా కోరారు. హెూం గార్డు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావులు స్టేటు బ్యాంకు అధికారులతో సమావేశమై, హెూంగార్డులకు ప్రతీ మాసం జీత, భత్యాలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయని, వారి ఆర్థిక అవసరాలును తీర్చు కొనేందుకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాల్సిందిగా కోరారు. బ్యాంకు అధికారులు హెూంగార్డు వేతనాలను పరిశీలించి, రూ॥ 2.20 లక్షల వ్యక్తిగత రుణాన్ని మంజూరు చేసేందుకు అంగీ కరించారు. మొదటి విడతగా జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న 15 హెూంగార్డులకు ఒక్కొక్కరికి రూ॥ 2.20 లక్షల చొప్పున వ్యక్తిగత రుణాలను అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు చేతుల మీదుగా, మేనేజరు ఎ.టి. శ్రీనివాసరావు,ఎన్. రామకృష్ణ, మేనేజరు ఎన్.వి. లక్ష్మిల సమక్షంలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో అందజేశారు.

## మెల్లి రమ్యను పరామర్శించిన వైసీపీ శ్రేణులు



పరవాడ : పరవాడ మండలం తానాంలో బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో అదివారము కెమిస్టరీ ఫాకల్టీగా అవుట్ సోర్సింగ్ లో పనిచేస్తున్న మెల్లి రమ్య అత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. సోమవారము విశాఖ పట్నంలోని ఎన్అర్ఐ ఆసుపత్రి ఐసియులో చికిత్స పొందుతున్న ఈమెను పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ వాళ్ల సోదరుడు అన్నంరెడ్డి అజయరాజ్ మరియు ఎఫ్‌సిఐ మెంబర్ పి.యస్.రాజు పరామర్శించారు. అనంతరము అత్మహత్యకు ఎందుకు పాలుపడిందో తదితర విషయాలు గురించి అడిగి తెలుసుకున్నారు.

## 'ఫోరం ఫర్ బెటర్ ' ముందడుగు



విజయనగరం: పట్టణంలోని ప్రముఖ స్వచ్ఛంద సంస్థల సమాహారం "ఫోరం ఫర్ బెటర్" ప్రజల అవగాహన కోసం భూగర్భ జలాల అభివృద్ధి, ప్లాస్టిక్ నిషేదం, ఇంకుడు గుంతల ప్రాముఖ్యత, మొక్కల పెంపకం వివిధ ప్రజాప్రయోజన కార్యక్రమాలతో ముద్రించిన 20వేల కరపత్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ ఆవిష్కరించారు. కలక్టర్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫోరంలోని సంస్థలన్ని రోజుకు ఒక స్థలాన్ని ఎంపిక చేసుకుని మొక్కలునాటి కరపత్రంలో పేర్కొన్న అంశాలపై ప్రజాఅవగాహన చేపట్టలని భావించడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ -2 జె.సీతా రామారావు, డిఆర్ఓ వెంకటరావు, ఫోరం అధ్యక్షులు డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, థెరిసా క్లబ్ అధ్యక్షులు కోలగట్ల తమ్మన్నశెట్టి, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు సుష్మిత, కార్యదర్శి మాధురి, జిహెచ్వి ట్రస్ట సభ్యులు హర గోపాల్ తదితర సంస్థలు, సభ్యులు పాల్గొన్నారు.

## చంద్రయాన్ ప్రయోగంపై అవగాహన



గొలుగొండ : చంద్రయాన్ ప్రయోగాన్ని చీడిగుమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డిజిటల్ క్లాస్‌రూమ్ ద్వారా సోమవారం వివరించారు. అసలు రాకెట్ లాంచింగ్ అంటే ఏమిటి వాటిని ఎలా కక్షలో ప్రవేశ పెడతారు అనే విషయాన్ని పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు ఎవి.రాజగోపాల్ విద్యార్థులకు వివరించారు. ప్రయోగాన్ని ప్రత్యక్షంగా చూసినందుకు విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిపిఎస్ నాగేంద్ర మాట్లాడుతూ ఇలాంటి ప్రయోగాలు ప్రత్యక్షంగా చూడడం ద్వారా సైంటిస్ట్ అయ్యేందుకు వీలుంటుందని వివరించారు.

## క్లష్టర్ కోఆర్డినేటర్ అంతర్గత బదిలీలు

అనంతగిరి : మండలం లో వెలుగు పథకంలో పనిచేస్తున్న క్లష్టర్ కోఆర్డినేటర్ అంతర్గత బదిలీలు చేసినట్లు వెలుగు ఏపీఎం ఎ స్ వీడి, సురేష్ తెలిపారు. అనంతగిరి క్లష్టర్‌కు టి.శ్రీరాములు, గేటువలస, క్లష్టర్ కు, నారాయణరావు,వేంగడ, క్లష్టర్ కు, గురుమూర్తి, భీంపోలు, క్లష్టర్ నకు, పి,త్రినాధ్, చిలకల గెడ్డ, క్లష్టర్ నకు చెన్నకేశవ రెడ్డి, కాశీపట్నం క్లష్టర్ నకు, సి హెచ్ ఆనంద్, పెదబిడ్డ,. క్లష్టర్ నకు, ఎం మంగ్లన్న, పెదకోట క్లష్టర్‌నకు, ఎల్.బి.అప్పలస్వామి, లను నిర్ణయించామన్నారు అలాగే హెడ్ సీసీగా కె.రమణ,ఎఫ్ పీజీ సీసీగా కె.వాసులను నిర్మించామని ఆయన తెలిపారు.

## శ్రీక్షేత్రమ్‌ను సందర్శించిన జిల్లా కలక్టర్



విజయనగరం : ప్రముఖ భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రంలో గల అష్టలక్ష్మీసమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని జిల్లా కలక్టర్ డాక్టర్ ఎం హరిజవహర్‌లాల్ సోమవారం ఉదయం సందర్శించారు. శ్రీక్షేత్రమ్‌లో ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం దేవాలయం ప్రధాన అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, భద్రం విద్యాసాగర్ ఆచార్యులు వేదమంత్రాలను పఠిస్తుండగా దేవాలయంకు సంబంధించిన జ్ఞాపికను ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు కలక్టర్‌కు అందచేసారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు నాగేశ్వరరావు, లింగారావు, నీరజ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు ప్రజలను అప్రమత్తం చేయండి



విశాఖపట్నం :- నగరంలో దోమల ఉత్పత్తి, వ్యాప్తిపై ప్రజలను అప్రమత్తం చేయడానికి, విస్కృత ప్రచారం కొరకు నాలుగు డిజిటల్ ప్రచార రధాలను సోమవారం జివియంసి కమిషనర్ డా.జి.సృజన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణకై విస్కృత ప్రచారం నిర్వహించాలని పేర్కోన్నారు. ప్రజలకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, ఆరోగ్య జీవనం గురించి వివరించాలని కోరారు. రోడ్లపై బహిరంగ ప్రదేశాలలో, చిన్న చిన్న గోతులలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఇంటిపై గల డాబాలపై, వాటర్ ట్యాంకులలో లార్వాలు అభివృద్ది చెందకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఉపయోగించని పాతడబ్బాలు, టైర్లు, కొబ్బరిబోండాలు, ఇతర పాత సామగ్రిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అభిలషించారు. మొక్కల కుండీలు, పళ్ళేంలలో, మనీప్లాంట్‌లలో, సెప్టిక్ ట్యాంకు గొట్టాలకు మెస్‌ను తప్పనిసరిగా అమర్చాలని పేర్కోన్నారు. ఇంటిలోని ఫ్రిజ్ వెనుక బాక్సులలో, ఎయిర్ కూలర్స్, ఫ్లవర్ వాజ్‌లలో లార్వాలు అభివృద్ధికి దోహదపడకుండా చూడాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరు దోమ తెరలను వాడాలని, దోమల నుండి రక్షణపొంది ఆరోగ్యజీవనానికి నాంది పలకాలని పేర్కోన్నారు. కార్యక్రమంలో సి.యం.ఓ.హెచ్ డా.ఏహేమంత్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వై.మంగపతిరావు, అదనపు కమిషనర్లు ఏ.వి.రమణి(జనరల్), జి.సత్యనారాయణ తదితరులు పాల్గోన్నారు.

# పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్ధికి ప్రోత్సాహం



భీమునిపట్నంః గతేడాది పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించిన దనియాల అచ్చుతను అభినందిస్తూ ముత్తంశెట్టి శ్రీనివాస రావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మాత్యులు సొంత నిధులతో రూ.10 వేలు ప్రోత్సాహానికి మంత్రి అందచేశారు. ఈ అమ్మాయి తండ్రి ఆటోను నడుపుతున్నట్లు తెలుసుకొని మంత్రివర్యులు చలించిపోయారు. ఆనందపురం మండలం కేంద్రమైన ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన తరగత గదులను ప్రారంభోత్సవానికి వచ్చి ఈ విధంగా విద్యార్థులను ఎంతో ప్రోత్సహించారు. విద్యార్థులతో మమేకమై పాఠశాల అంత కలిసి తిరిగారు. ఈ జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా స్థాపించారు. పాఠశాల ఆటస్థలంను చదును చేసేందుకు ఒక పి ఇ టి పోస్టుకు మంజూరు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి ఒక్క పేద విద్యార్థికి ఉచిత స్టడీ మెటీరియల్స్ అందచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## కరెంటుపోల్ ని ఢీకొన్న స్కూల్ బస్సు
# తప్పిన భారీ ప్రమాదం



సింహాచలం: 72వ వార్డు పరిధిలో గల సాయి నగర్ కాలనీ లో సోమవారం ఉదయం భాష్యం స్కూల్ బస్సు విద్యార్థుల తో వెళుతూ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నది దీంతో విద్యుత్ స్తంభం పూర్తిగా విరిగి పోయింది . అదృష్టవశాత్తు విద్యుత్ తీగలు కింద పడిన బస్సు పై పడకపోవడంతో విద్యార్థులు వెంటనే క్రిందకు ధించి ఇళ్లకు పంపించివేశారు ఈ సంఘటన చూసిన స్థానికులు ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఆందోళన చేపట్టారు ఫిట్నెస్ లేని బస్సులను ట్రాన్స్ పోర్టు అధికారులు ఏ విధంగా అనుమతించారని ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే దానికి బాధ్యత ఎవరు వహిస్తా రని ఉదయం వేళ తక్కువ జనసంచారం తో విద్యుత్ నిలిచిపోవడంతో ఎవరకి ఎటువంటి ప్రమాదం సంభవించలేదని అందరు ఊపిరి పీల్చుకొన్నారు.

# ఏయూ హాస్టల్‌లో విద్యార్థులకు వసతి కల్పించాలి



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎన్నో ఆశలతో ఎంతో మంది విద్యార్థినీలు వివిధ కోర్సులలో ప్రవేశం పొందారు. చాలా మంది విద్యార్థినిలు ఉన్నత చదువుల కోసం దూరప్రాంతాల నుండి ఏ.యూ.లో ప్రవేశం పొందారు. కానీ ప్రస్తుతం యూనివర్శిటీ క్లాసులు ప్రారంభమై 20 రోజులు కావస్తున్న ఇప్పటి వరకూ 200 మంది విద్యార్థినీలకు హాస్టల్ వసతి లేక చదువు కొనసాగించాలా? మానివేయాలా? అనే సంధిగ్ధంలో ఉన్నారు. మరికొంత మంది ప్రైవేటు హాస్టల్‌లో రోజుకు రూ॥250/-లు చొప్పున వసూలు చేసి దోపిడీ చేస్తున్నారు. ఎప్పుడు హాస్టల్ వసతి ఏ.యూ. కల్పిస్తుందో తెలియక దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షుగా విద్యార్థినీల పరిస్థితి ఉంది. కావున సత్వరమే అందరికీ ప్రైవేట్ బిల్డింగ్ లేదా యూనివర్శిటీలో ఉన్నటువంటి ఖాళీగా ఉన్న బిల్డింగైనా చూసి హాస్టల్ వసతి కల్పించి, విద్యార్థినీలను ఆదుకోవాలని కోరుచున్నాము. తెలుగు దేశం పార్టీ హయాంలో గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డీన్‌లుగా నియమించబడిన వారి తొత్తులను వెంటనే తొలగించాలి. ఏ.యూ. హెల్త్ సెంటర్ డాక్టర్ మూర్తిగారిని తొలగించండి. నూతన (ఎమ్.డి.) డాక్టర్‌ని నియమించండి. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్.సి.పి. విద్యార్థి విభాగం, విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు బి.కాంతారావు, అరకు పార్లమెంట్ అధ్యక్షులు టి.సురేష్, ఏ.యూ. అధ్యక్షుడు బి.మోహన్, రాష్ట్ర కార్యదర్శులు యస్.కుమారస్వామి, ఎమ్.కళ్యాణ్, విద్యార్థి నాయకులు సిహెచ్.క్రాంతికిరణ్, రంజిత్, సాయికృష్ణ, నిషేక్, వెంకటేష్, విజయక్రిష్ణ, శంకర్ మరియు అధికసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## హిందీ పరీక్షల సర్టిఫికెట్లు పంపిణ



భీమునిపట్నం : స్థానిక ఆదర్స్ హిందీ ప్రేమీమండలి కార్యాలయం లో ఫిబ్రవరిలో నిర్వహించిన హిందీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ఆదర్స్ హిందీ ప్రేమీమండలి గౌరవ అద్యక్షులు మరియు టిడిపి భీమిలి డివిజన్ అద్యక్షులు గంటా.నూకరాజు 80 మందికి సర్టిఫికెట్లు పంపిణిచేసారు,ఈ కార్యక్రమం లో ఆదర్స్ హిందీ ప్రేమీమండలి అద్యక్షులు ఎస్.ఆర్.కృష్ణారావు మాస్టర్లు బోను.సంజీవరావు, పి.రాజేష్, రమాదేవి టీచర్ ,కాసరపు.నాగరాజు విద్యార్థిని విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## సత్యదేవుని నిత్య అన్నదాన పధకానికి, సహస్ర దీపాలంకరణ సేవలకు రూ.4,96,000/- విరాళం



అన్నవరం...తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకముగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పధకానికి మరియు సహస్రదీపాలంకరణ సేవలకు నిమిత్తము వనపర్తి జిల్లా బందర్ నగర్ గ్రామానికి చెందిన కె.యమ్.ప్రభావతమ్మ అన్నదానం నిమిత్తము రూ.3,00,000/-సహస్రదీపాలంకరణ సేవ నిమిత్తము రూ.1,96,000/- లు కలపి మొత్తం రూ.4,96,000/- మొత్తమును దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎంవి.సురేష్ బాబు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో కార్తీక పౌర్ణమి రోజున కృష్ణారెడ్డి పేరున అన్నదానం జరిపించవలెనని కోరారు.ఈ సందర్భంగా ఈవో సురేష్ బాబు దాతలను అభినందించారు.

## ఏపిఈపిడిసిఎల్ అధికారులకు ఇంధన పొదుపుపై శిక్షణా కార్యక్రమాలు



విశాఖపట్నం : బ్యూరో అఫ్ ఎనర్జీ ఎఫిషియన్సి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ మరియు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల అద్వర్యంలో ఏపీఈపిడిసిఎల్ ఇంజనీర్ అధికారులకు సోమవారం విశాఖపట్నంలో డిమాండ్ సైడ్ మేనేజ్మెంట్ (డీఎస్ఎం) మేజర్స్ పై ఐదు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఏపీఈపిడిసిఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స ఆపరేషన్స్) శ్రీ కె.రాజబాపయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ కె.రాజబాపయ్య మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ తరగతుల కార్యక్రమాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం వలన ఇంధన పొదుపు కార్యక్రమాలను మరింత సమర్ధవంతంగా అమలుపరచవచ్చున్నారు. ఈ శిక్షణ తరగతులలో అధికారులు నేర్చుకున్న మెలకువలను వినియోగదారులకు వివరించి ఇంధన పొదుపు చర్యలను విస్తృతంగా పాటించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏపీఈఆర్సి డిప్యూటి డైరెక్టర్ శ్రీ రామయ్య శెట్టి ఇంధన పొదుపు కార్యక్రమాలను మెరుగుపరిచే వివిధ పద్దతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ ఇ డి బల్బుల పంపిణి, ఇంధన పొదుపు ఫేన్ల పంపిణి, ఎల్ ఇ డి ట్యూబ్ లైట్ల పంపిణి, వ్యవసాయ పంపుసెట్లు మార్పిడి, ఎలక్ట్రిక్ కార్ల వినియోగం ద్వారా చేస్తున్న ఇంధన పొదుపు కార్యక్రమాలను వివరించారు.

సి.ఐ.ఐ. ప్రిన్సిపాల్ కౌన్సలర్ పి.వి.కిరణ్ అనంత్, ఏపీఈపిడిసిఎల్ ఎనర్జీ కన్జర్వేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ జి.శరత్ కుమార్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని ఐదు జిల్లాల నుండి 40 మంది అధికారులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అన్నవరం పోలీసు స్టేషన్‌ను సందర్శించిన మానవ హక్కుల కమీషన్ సభ్యులు



అన్నవరం.... తూ.గో.జిల్లా శంఖవరం మండలం అన్నవరంలో స్దానిక పోలీసు స్టేషన్ ను ఆదివారం మానవ హక్కుల మిషన్ జిల్లా లీగల్ కార్యదర్శి,ప్రముఖ న్యాయవాది,పెద్దాపురం డివిజన్ ఎస్సీ,ఎస్టీ మోనారింటింగ్ కమిటీ సభ్యుడు పిల్లి. బలరాముడు,మిషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సభ్యులు ఇండుగపల్లి. నూకరాజు, న్యాయవాది పలివెల. నాగేంద్రరాజు,అబ్బిరెడ్డి. నారాయణరెడ్డి,పెద్దింటి. లక్ష్మణరావు, గంపల.రాజు,టి. గణేష్ తదితరులు స్థానిక పోలీసు స్టేషన్ ని సందర్శన చేసి,ప్రజా ఫిర్యాదులు గురించి,రికార్డుల నమోదులు,తీసికొన్న చర్యలు గురించి ఎస్సై మురళీమోహన్ ను మిషన్ సభ్యులు ఆరా తీసారు.ఈ మిషన్ పరిశీలనలో విచారణ జరిపి, భవిష్యత్తులో ప్రజలకు అందుబాటులో ఉండి సత్వరం న్యాయం చేయాలని కోరారు.అలాగే సక్రమంగా పోలీసులు రికార్డుల్లో ప్రతీ రోజు రికార్డులను వెంటనే నమోదు చేయాలి అని,అలాగే రసీదులు తప్పనిసరిగా పిర్యాది కి అందించాలి అని,రశీదులు తీవ్ర జాప్యం వలన కోర్టు నందు పిర్యాది నష్టం వాటిల్లి,శ్రమ,సమయం,డబ్బులు వృదా అవుతున్నాయని,అలాగే సెక్షన్ 41 నోటీసులు ద్వారా రిమాండ్ ముద్దాయి హక్కుని కల్పించాలని అయితే దీని ద్వారా ప్రభుత్వ ప్రజా ధనం వృధా ఖర్చు తగ్గి ,మంచి జరిగే అవకాశం పోలీసు వారు కల్పించాలి అని,అలాగే ప్రజా హక్కులకు భంగం కలిగించే పరిస్థితిని అవినీతి కార్యకలాపాలు మిషన్ క్షమించబోదు అని,వీటి మీద ప్రజా,న్యాయ కోర్టుల్లో ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని అధికారులను కోరారు.

# వాడి వేడిగా సాగిన పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం

యానాం :సోమవారం జరిగిన పుదుచ్చేరి అత్యవసర అసెంబ్లీ సమావేశం 9:30 కు ప్రారంభమైన ఈ సమావేశం జల వనరులను అభివృద్ధి చేయడంపై కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు ఆదేశించడంతో జరిగిన ఈ అత్యవసర సమావేశం ఈ సమావేశంలో అనేక సమస్యలు తలెత్తడంతో వాడివేడిగా సాగింది .ఈ సందర్భంగా ముఖ్య మంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ జల వనరులను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయడంపై పలు సూచనలు సలహాలు చేశారు .అనంతరం జరిగిన ఈ సమావేశంలో అధికార ప్రభుత్వానికి తెలియకుండా గవర్నర్ ఆదేశాల మేరకు ఎల్ ఏ డి కార్యదర్శి మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయడంతో అధికారపార్టీ ఎమ్మెల్యేలు తెలియకుండా నోటిఫికేషన్ ఇవ్వడంపై ఈ సమావేశంలో అడుగగా దీనిపై స్పందించిన స్పీకర్ ఈ విషయంపై సమాధానం ఇవ్వాలని లేనియెడల అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పీకర్ తెలిపారు .ఈ సమావేశంలో మంత్రులు ,ఎమ్మెల్యేలు తదితరులు పలు సమస్యలను వాడివేడిగా చర్చించారు .

## బిహెచ్ ఎంపిపి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరము



నర్సీపట్నం...... విశాఖపట్నం జిల్లా గొలుగొండ మండలం కేడీ.పేట మరియు ఏఎల్ పురం గ్రామాలలో బేసిక్ హెల్త్ కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో అసోసియేషన్ గౌ.అధ్యక్షుడు బొప్పన.లక్ష్మణరావు మరియు విశాఖపట్నం నగరానికి చెందిన ఇండస్ హాస్పిటల్ వైద్య అధికారి డాక్టర్. సూరెడ్డి.నాగేశ్వరరావు ఎమ్.డి,డి.ఎమ్,కార్డియాలజీ వారిచే అక్కడ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు రామదాస్, నాగలక్ష్మి,రమణ,వెంకట్రావు,బుజ్జి,బాబి తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలియజేసిన కరెళ్ళ మరియు పదిలం





అన్నవరం...... తూ.గో.జిల్లా అన్నవరంలో బేసిక్ హెల్త్ కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శి లు కరెళ్ళ.గణపతిరావు, పదిలం.బెన్నబాబు చంద్రయాన్- 2 ప్రయోగం విజయవంతం అవ్వడంపై హర్షం వ్యక్తం చేసారు.

ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు బేసిక్ హెల్త్ కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ మరియు ఫెడరేషన్ ఆఫ్ ఫస్ట్ ఎయిడ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కరెళ్ళ.గణ పతిరావు మాట్లాడుతూ చంద్రయాన్ విజయం నూటముప్పై కోట్ల భారతీయుల విజయమన్నారు. చంద్రయాన్ ప్రయోగం విజయంతో ప్రపంచంలో 'క్రయోజనికి టెక్నాలిజీ' వినియోజించే కొన్నిదేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత మన శాస్త్రవేత్తలకు దక్కుతుందని అన్నారు.

## వాలేంటీర్ల ఉద్యోగాలకు ఎటువంటి డబ్బులు ఇవ్వవద్దు - కె కె రాజు



విశాఖపట్నం : ప్రభుత్వం నియమిస్తున్న వాలేంటీర్ల ఉద్యోగాలకు కొరకు ఎవ్వరూ ఎటువంటి డబ్బులు ఇవ్వవద్దని విశాఖ ఉత్తర నియోజకవర్గ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కె కె రాజు ఒక ప్రకటన లో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రతీ సంక్షేమ పథకం ప్రజల చేరవేసేందుకు మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు గ్రామాల్లో గ్రామ వాలేంటీర్లు నగరంలో వార్డు వాలేంటీర్లు ను ప్రభుత్వం నియమిస్తుందని ఈ ఉద్యోగుల నియామకాలు ఇంటర్వ్యూ లు పారదర్శికశీగా జరుగుతున్నాయని అర్హత గలగి సేవా దృక్పథం గల వారికి మాత్రమే అధికారులు ఎంపిక చేస్తారని ఈ విషయంలో ఎటువంటి పైరవీరలకు తావు లేదన్నారు. ఈ ఉద్యోగాలకు ఎవ్వరూ ఎటువంటి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ఆయన అన్నారు. అలా ఎవరైనా మభ్యపెడితే మా దృష్టి కి తీసుకురావాలని ఆయన కోరారు.

## రాత్రి వేళలో వాహనముల హెడ్ లైట్లుకు ఉమర్ ఉపయోగించవలెను

విశాఖపట్నంః జి.ఎస్.ఆర్. 634 (E), తేదీ 23.06.2017 అలగే మోటారు వాహనముల చట్ట ప్రకారం రూల్ 31 (4) మోటారు వాహనముల (డ్రైవింగు) రెగ్యులేషన్స్, 2017 ప్రకారం రాత్రి వేళలలో వాహనములు నడిపేటపుడు హెడ్ లైట్లు డిప్పర్ లైట్లను తప్పనిసరిగా ఉపయోగించాలని ఉప రవణా కమీషనర్, జి.సి.రాజా రత్నం తెలియజేశారు. రోడ్డు భద్రతాలో భాగంగా రాత్రి వేళలలో వాహనములు నడిపేటపుడు హెడ్ లైట్లలో హై బీం లైట్లు వాడడం వలన ఎదురుగా వచ్చే వాహనముల పై ఆ వెలుగు పడడం వలన ఎదుట వచ్చే వాహన చోదకుల కళ్ళలో వెలుగు పడడం వలన ప్రమాదాలు ఎక్కువగా జరిగుతున్నాయని, అలగే ఇప్పుడు కొత్తగా వస్తున్నా బీస్ 4 వాహనములకు ఎల్.ఇ.డి. లైట్లతో అమర్చబడుతున్నాయి వాటి వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియజేశారు.

ఈ నిబంధన ప్రకారం వాహన చోదకులందరూ కూడా పాటించాలని ఉప రవాణా కమీషనర్ పత్రికముఖంగా తెలియజేశారు. ఈ నిబంధన ప్రమాద కరంగా వాహనము నడుపుటలోనికి వస్తుందని తెలియజేశారు. రాత్రి వేళల్లో డిప్పర్ లైట్లను వాడడం రాత్రి వేళలో జరిగే ప్రమాదాలను అరికట్టవచునని తెలియజేశారు.ప్రత్యేక తనిఖీలు నిర్వహించి డిప్పర్ లైట్లు వాడని వాహన చోదకులకు పైన తెలిపిన నిభందన అతిక్రమణ క్రింద రూ.1000/- లు అపరాధ రుసుమును వసూలు చేయడం జరుగుతుంది. కనుక అందరూ ఇది గమనించి రాత్రి వేళలలో ఉమ్మర్ లైట్లు వాడాలని ఇందుమూలంగా తెలియజేయడమైంది.

# శ్రీవారిని దర్శించుకున్న వానప్రస్థం ఆశ్రమవాసులు



తిరుమల: గ్రేటర్ విశాఖ 38వ వార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లో ఉన్న వానప్రస్థం ఓల్డేజ్ హోమ్ ఆశ్రమ వాసులు ఇలవైకుంఠమైన తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేసుకున్నారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి, పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర మహాసరస్వతి స్వామి వారి దివ్య అనుగ్రహంతో వీరంతా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

వానప్రస్థం ఓల్డేజ్ హోమ్ వ్యవస్థాపకుడు రొబ్బి శ్రీనివాస్ (నివాస్) ఆశ్రమవాసులందరినీ ప్రత్యేక ఏర్పాట్లతో తిరుమలకు తీసుకువెళ్లి శ్రీవారి దర్శన భాగ్యాన్ని కలిగించి అనంతరం వారితో పలు సేవా కార్యక్రమాలు గావించారు.



హిమాలయ పాదప్రాంతమైన పవిత్ర పుణ్యస్థలం రుషీకేశ్‌లోని శారదాపీఠంలో చాతుర్మాస్య దీక్షాకాలంలో గురువులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి వారి సమక్షంలో పవిత్ర గంగామాతకు పూజలు నిర్వహిస్తున్న శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వారు

### స్పందనలో వచ్చిన పిటిషన్లకు అధికారులు

# స్పష్టమైన సమాధానం తెలిపాలి

### జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్



విశాఖపట్నం: స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణముగా పరిశీలించి తగు చర్యలు చేపట్టి స్పష్టమైన, వివరములతో కూడిన సమాధానమును దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి తెలియజేయాలని జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరు స్పందన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వస్తున్న ధరఖాస్తులు, వివిధ శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యలు, ఇస్తున్న సమాధానాలపై సమీక్ష గావించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారముపై అత్యంత ప్రాధాన్యత కనబరుస్తున్నారని, ప్రతి మంగళవారం కలెక్టర్లతో ఈ విషయముపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి రోజు జిల్లా అధికారులు మొట్ట మొదట 30 నిమిషాలు స్పందన ధరఖాస్తుల పరిశీలన వాటి పరిష్కారానికి కేటాయించాలన్నారు. ధరఖాస్తు దారునకు పొంతన లేని సమాధానాలు యిస్తే అధికారులు భాధ్యులు కావలసి ఉంటుందని హెచ్చరించారు. శాంపుల్ ఎండార్స్‌మెంటును పంపడం జరిగిందని ఆ విధముగా వివరములతో కూడిన సమాధానం తెలియజేయాల్సి ఉంటుందన్నారు. వచ్చిన దరఖాస్తులలో 24 గంటలు 3రోజులు/7రోజులలోపు పరిష్కరించవలసిన వాటిని ఆ లోపు ఖచ్చితముగా పరిష్కరించాలన్నారు. లేనిచో ప్రజలకు నమ్మకం ఏం ఉంటుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి క్షేత్ర పర్యటనలలో స్పందన ధరఖాస్తుల పరిష్కారముపై సంబంధిత ఫిర్యాదు దారుతో చర్చించడం జరుగుతుందన్నారు. కాబట్టి ఫిర్యాదుల పరిష్కారము వేగవంతముగా జరగడంతో పాటు వాటి పరిష్కారము అర్ధవంతముగా ఉండాలన్నారు. రిమార్కులు రాసి ఎండార్స్‌మెంటును అధికారి సంతకం తో పంపాలన్నారు. ఈ రోజు స్పందన కార్యక్రమానికి 945 ధరఖాస్తులు రాగా డయల్ యువర్ కలెక్టర్ కు 13 కాల్స్ వచ్చాయి .. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎల్.శివశంకర్ మండల స్థాయి అధికారులతో స్పందన కార్యక్రమం పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో ఎ జెసి , జిల్లా రెవెన్యూ అధికారి జి.గున్నయ్య జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రతీ కుటుంబానికి రూ. 10 లక్షలు లబ్ధిపొందే పథకాలు

### చింతమడక సందర్శన .. ఆత్మీయ అనురాగ సభలో సీఎం కేసీఆర్

హైదరాబాద్ : చింతమడకలోని ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షలు లబ్ధి పొందే పథకానికి శ్రీకారం చుడుతామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. చింతమడకలో సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఆత్మీయ అనురాగ సభలో కేసీఆర్ ప్రసంగించారు.

చాలా కాలం తర్వాత నా కోరిక నెరవేరుతుంది. రైతుబంధు, రైతుబీమా సౌకర్యం కల్పించిన రోజు చాలా సంతోషపడ్డాను. మన రాష్ట్రంలో ఆలోచించినట్లు.. దేశంలో రైతుల గురించి ఆలోచించడం లేదు. ఈ పథకాలు పేద కుటుంబాలకు అండగా ఉన్నాయి. చింతమడక చాలా మంచి ఊరు. వాస్తు కూడా అద్భుతంగా ఉంది. ఊరికి నాలుగు మూలల్లో నాలుగు అద్భుతమైన తటాకాలు ఉన్నాయి. మళ్లీ గ్రామంలో నీటి ఊటలు, బావుల్లో జాలు చూడబోతున్నాం. మీ ఊరి బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్నాడు. చనుబాలు ఇచ్చి పెంచిన నా ఊరు చింతమడక. మరో మూడు గ్రామాలు నాకు విద్యాబుద్ధులు ప్రసాదించాయి.

తొలి ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలను పరిష్కరించాం. విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా చేశాం. ఈసారి స్వగ్రామ అభివృద్ధికి సంకల్పించాం. ఊరు బాగుపడాలంటే ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలి. ఎర్రవల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని బాగు చేశాను. మీకు మంచిగా పని చేసే కలెక్టర్ ఉన్నాడు. ఊరికి అర్జెంట్‌గా రెండు రోడ్లు కావాలి.. మూడు నెలల్లో వేయిస్తాం. ఒక్క చింతమడకలనే బాగుచేస్తే దంతె కలవదు కాబట్టి.. నియోజకవర్గమంతా అభివృద్ధి చేస్తాం.

రాష్ట్ర ఆరోగ్య సూచిక తయారుచేస్తాం. చింతమడక నుంచే ఆరోగ్య సూచిక తయారీకి నాంది పలకాలి. చింతమడక ఊరంతా ఆరోగ్య పరీక్షలు చేసేందుకు శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వైద్యం అందిస్తాం. వెంటనే ఉచిత కంటి శిబిరం ఏర్పాటు చేయాలని హరీష్ రావును కోరుతున్నా.



నెల రోజుల్లో చింతమడకలో సమస్యలు లేకుండా చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యేలను కోరుతున్నాను. చింతమడక ప్రజల హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలి. యావత్ తెలంగాణ ఆరోగ్య సూచిక తయారు చేయాలనే ఆలోచన ఉంది.

చింతమడకలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తా. వలస వెళ్లిన వారిని కూడా పిలిచి పథకాలు అందేలా చూడాలి. గ్రామంలోని ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షలు లబ్ధి చేకూరుస్తాం. ప్రభుత్వం అందించే లబ్ధి ద్వారా యువత ఉపాధి పొందాలి. ఎవరు ఏ ఉపాధి మార్గం ఎంచుకున్నా అభ్యంతరం ఉండదు. ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షలు లబ్ధి పొందే పథకానికి శ్రీకారం చుడుతాం. వరి నాటేసే మిషన్లు కొనుకుంటే లాభసాటిగా ఉంటుంది. ఎవరికి నచ్చిన పని వారు చేసుకుంటే లబ్ధి తప్పక పొందుతారు.

పైసలు మిగిలితే ఆవులో, బర్రెలో కొనుక్కోవాలి. ఊరిలోని 2 వేల కుటుంబాలు బాగుపడాలి. చింతమడకలో నాలుగు నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి అని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

# స్పందనలో ఫిర్యాదుల స్వీకరణ

### సమస్యల నివారణకు 'స్పందన' మంచి వేదిక

### ఫిర్యాదులపై అధికారులు అప్రమత్తం కావాలి

### జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ




విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా పోలీసు కార్యాలయములో జిల్లా ఎస్.పి., బాబూజీ అట్టాడ స్పందన కార్యక్రమములో స్వయంగా భాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం జిల్లా ఎస్.పి., కార్యాలయమునకు మొత్తం 18 ఫిర్యాదులు వచ్చాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా మొత్తం 32 ఫిర్యాదులు వచ్చాయి వాటిలో అస్తులకు, కుటుంబ కలహాలు మరియు మోసాలకు సంబంధించిన మరియు ఇతర ఫిర్యాదులు ఉన్నాయి. గత మూడు పర్యాయముల స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి ఫిర్యాదుదారులకు తెలియపరచడమైనదని తెలియజేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా అనకాపల్లి సబ్ డివిజన్ - 10, నర్సీపట్నం సబ్ డివిజన్ - 20, అనకాపల్లి ఉమన్ పి.ఎస్ - 02 మొత్తంగా 50 (18+32), ఫిర్యాదులు వచ్చాయి.

ఈ కార్యక్రమములో కె.కె.వి.విజయనాథ్, ఇన్స్ పెక్టర్ కంట్రోల్ రూమ్., ఇతర అధికారులు పాల్గొన్నారు. 2. విశాఖపట్నం జిల్లా అడిషనల్ ఎస్.పి.,పరిపాలనగా పనిచేస్తూ విజయవాడ ఎ.సి.బి., కార్యాలయమునకు బదిలీపై వెళ్ళుచున్న బి.శరత్ బాబు వీడ్కోలు సభ జిల్లా పోలీసు కార్యాలయములో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి., బాబూజీ అట్టాడ ఐ.పి.ఎస్., మాట్లాడుతూ ఈ సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో బి.శరత్ బాబు తనవంతు కీలక పాత్రను పోషించి ఎన్నికలు విజయవంతముగా జరుగుటకు కృషిచేశారు. జిల్లా ఎస్.పి బదిలీపై వెళ్ళుచున్న బి.శరత్ బాబు శాలువా కప్పి, మెమొంటో ఇచ్చారు. ఈ కార్యక్రమములో ఎస్.అప్పలనాయుడు, డీ.ఎస్.పి., డి.ఎస్.బి., - ఎ.నరసింహమూర్తి, డి.ఎస్.పి., విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ - సి.హెచ్.వివేకానంద, డి.ఎస్.పి., కమ్యూనిటీ పోలీసింగ్ మరియు జిల్లా పోలీసు కార్యాలయము, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ నరసింహన్‌కు ఆత్మీయ వీడ్కోలు



విజయవాడ: రాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన ఈఎస్-ఎల్ నరసింహన్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికింది. ఇప్పటివరకూ రెండు తెలుగు రాష్ట్రాలకు నరసింహన్ గవర్నర్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త గవర్నర్‌గా విశ్వభూషణ్ హరిచందన్ నియమితులు కావడంతో నరసింహన్ ఇక మీదట తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో నరసింహన్‌కు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దంపతులు ఈ సందర్భంగా నరసింహన్, విమలా నరసింహన్‌ను సత్కరించి, జ్ఞాపికను అందచేశారు.

#### వైఎస్ జగన్ పాలనలో మరిన్ని సెంచరీలు చేయాలి

ఈ సందర్భంగా నరసింహన్... ఆంధ్రప్రదేశ్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తనకు చిన్నప్పుడు విజయవాడలోనే అక్షరాభాస్యం జరిగిందని ఆయన జ్ఞాపకం చేసుకున్నారు. నరసింహన్ మాట్లాడుతూ.. ఏపీకి గవర్నర్‌గా వస్తానని నేనెప్పుడూ అనుకోలేదు. గడిచిన పదేళ్లు ప్రాక్టీస్ మ్యాచ్‌లాంటిది. ఈ 34 రోజులుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన ప్రతి బాల్ సిక్సర్, బౌండరీలు తాకుతున్నట్లు ఉంది. పాలనలో వైఎస్ జగన్ మరిన్ని సెంచరీలు చేయాలని కోరుకుంటున్నా. వైఎస్ జగన్‌కు ఆయన సతీమణి భారతి ఒక బలం. అసెంబ్లీలో వైఎస్ జగన్ వ్యవహారశైలి నియమావళికి అనుగుణంగా కొనసాగుతోంది. గవర్నర్‌గా ఈ నరసింహం వెళ్లిపోతున్నా... అహోబిలం, సింహాచలం, మంగళగిరి నరసింహులు మీతోనే ఉంటారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, అవినీతిరహిత రాష్ట్రం కోసం వైఎస్ జగన్ చేస్తున్న ప్రయత్నాలు కొనసాగాలి. నాకు సహకరించిన మంత్రులు, అధికారులకు కృతజ్ఞతలు అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, డీజీపీ గౌతమ్ సవాంగ్, అజేయ కల్లాం, డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, పలువురు మంత్రులు, వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు. ఆత్మీయ విందు అనంతరం నరసింహన్ దంపతులు తిరిగి హైదరాబాద్ వెళనున్నారు.

#### దుర్గమ్మ సన్నిధిలో నరసింహన్

అంతకు ముందు నరసింహన్ గవర్నర్ హోదాలో చివరిసారిగా ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.

గవర్నర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు అశీర్వచనాలు పలికి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ ఈవో... గవర్నర్ దంపతులకు అందచేశారు.

### ప్రపంచబ్యాంకు నిధులు రాకుండా అడ్డుకుంటున్నారు

గుంటూరు: ఏపీ రాజధాని అమరావతి తమది అనే భావన వైసీపీ నేతలకు లేదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిలో ముళ్లు, కంప తప్ప ఇంకేముంది అంటున్నారని, రాజధానిలో ఉంటే వారికి ముళ్లకంపపై ఉన్నట్టుందేమోనని ఆయన అన్నారు.








Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com